
పులి సంచరిస్తున్నట్టు కెమెరాలో చిక్కిన ప్రాంతమిదే

చిరుత.. కలకలం



- రాజమహేంద్రవరంలో భయాందోళన
- లాలాచెరువు వద్ద రిజర్వు ఫారెస్ట్
- మూడు రోజులుగా నక్కిన చిరుత పులి
- 50 ట్రాప్ కెమెరాలు..4 బోన్లు ఏర్పాటు
- 16 వరకు పుష్కరవనం మూత


చిరుతపులి..భయపెడుతోంది. రాజమహేంద్రవరం నగరాన్ని ఆనుకుని ఉన్న రిజర్వు ఫారెస్ట్ ఏరియా పరిసర ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తుండడం శుక్రవారం సీసీ కెమెరాల్లో స్పష్టంగా నమోదైంది. దీంతో స్థానిక ప్రజానీకం తీవ్ర ఆందోళన చెం దుతున్నారు. ఇప్పటి వరకూ ఆ చిరుతపులి జంతువులపై దాడిచేసిన సంఘటనలు లేవు. సీసీ కెమెరాలో మాత్రం ఒక పంది వెనుక నడుస్తున్న దృశ్యాలు స్పష్టంగా ఉన్నాయి.ఈ మేరకు అటవీ శాఖ అధికారులు అడుగు జాడలు గుర్తించారు.
- (రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

చిరుత పులి ఎక్కడ?

చిరుతపులి ఎక్కడి నుంచి ఎలా వచ్చిందనేదానికి అధికారుల వద్ద సమాధానం లేదు. హౌసింగ్ బోర్డు ఆటోనగర్ మధ్య ఒక జంతువును నోట కరచుకుని వెళుతున్న చిరుతపులిని శుక్రవారం ఒకరు చూసినట్టు ప్రచారం సాగింది.శుక్రవారం రాత్రి 11.25 గంటలకు లాలాచెరువు వద్ద ఉన్న టీవీ రిలేకేంద్రం(ప్రసార భారతి) ప్రధాన గేటు వద్ద ఉన్న సీసీ కెమెరాలో ఒక పందిని వెంబడిస్తూ వెళ్లిన చిరుతపులి స్పష్టంగా కనిపించింది. దానికి కొంత దూరంలో ఉన్న హైవే నుంచి టీవీ రిలే కేంద్రానికి వచ్చే దారిలో పులి అడుగులు ముందుగా గుర్తించారు. ఫారెస్ట్ అకా డమీకి దగ్గరలో ఉన్న వేయింగ్‌మిషన్ వద్ద అడుగు జాడలు గుర్తించినట్టు స్థానికులు చెబుతున్నారు. వేయింగ్ మిషన్ వెనుక ఉన్న తోట నుంచి టీవీ రిలేకేంద్రం వైపు వెళ్లినట్టు అడుగుజాడలు కనిపిస్తు న్నాయి. కానీ శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఆటోనగర్ ప్రాంతంలో ఒక గోడ మీద నుంచి వెళుతున్నట్టు అక్కడి వారు చెప్పినట్టు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. రిజర్వుఫారెస్ట్ 536 హెక్టార్లు. ఈ ప్రాంతంలోనే ఉంటుందనే అంచనా ఉంది.ప్రస్తుతం వానలు పడుతుండడంతో అడవిలో చెట్ల మీద..చెట్ల కింద ఉండే పులి ఉండే అవకాశం తక్కువ. టీవీ రిలే కేంద్రానికి సంబంధించి క్వార్టర్ల చుట్టూ తుప్పలు పెరిగాయి.శుక్రవారం రాత్రి వీటి సమీపంలోకి వెళుతూనే చిరుతపులి రిలే రిలే కేంద్రం సీసీ కెమెరాలకు చిక్కింది. బహుశా ఈ భవనాల్లో కూడా ఉండే అవ కాశం లేకపోలేదు. ఇక్కడ చాలా భవనాలు ఉన్నాయి. నిపుణులను రప్పించి వెంటనే దీనిని పట్టించాలని ప్రజ లు కోరుతున్నారు.

అడవి చుట్టూ జనావాసమే..

లాలాచెరువు సమీపంలో 536 హెక్టార్ల రిజర్వు ఫారెస్ట్ లాలా చెరువు -దివాన్‌చెరువు జాతీ య రహదారికి అటూ ఇటూ ఉంది. రిజర్వుఫారెస్ట్‌లో అటవీ అకాడమీ, పరిశోధన తదితర అటవీ కార్యాలయాలు ఉన్నాయి. రిలే కేంద్రం ఉంది. దాని వెనుక స్వరూపనగర్, రూపానగర్, శ్రీరామనగర్ ఉన్నాయి. రూపానగర్ మీదుగా శ్రీరాంపురం వెళ్లడానికి అటవీ దారి ఉంది. అక్కడ నుంచి దివాన్ చెరువు గ్రామం ఉంది. పుష్కరవనం పక్క ఆటోనగర్ ఉంది. వీటి మధ్యనే అడవి ఉంది. ఈ అడవిలోనే చిరుత పులి పుట్టి పెరిగిందా అనే అనుమానాలు ఉన్నాయి. ఇక్కడ పుట్టి పెరిగి ఉండొచ్చనే అనుమానం అధికారులు వ్యక్తపరచడం గమనార్హం. ఇక్కడే పుట్టి పెరిగిందనుకుంటే దాని తల్లి ఎక్కడ.. దాని ఫ్యామిలీ ఎక్కడ అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పైగా అధికారులు ఇది మగపులి అనీ, సబ్‌ఎడల్ట్ అంటే యుక్త వయసు కన్నా చిన్నదని చెబుతున్నారు. సుమారు 75 కేజీల బరువు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. పైగా ఇక్కడే పుట్టి పెరిగితే ఇంతవరకూ ఇక్కడ జంతువులపై దాడి చేసిన సందర్భాలు లేవు.



పులి సంచారం ఇక్కడే?

ఒక మగ చిరుతపులి ఒంటరిగా ఉంది.. దాని వయస్సు 3 నుంచి 4 సంవత్సరాలు. స్వరూప్‌నగర్, పద్మావతి నగర్, రూపానగర్,తారకరామనగర్, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీరాంపురం, దివాన్‌చెరువు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులన్నారు.

ఇక్కడిదా.. బయటదా?

అటవీ ప్రాంతం వెనుక జీడిమామిడి,నిమ్మ,సీతాఫలాలు, మామిడి తోటలు ఇంచుమించు అడవిలాగే ఉం టాయి. ఈ ప్రాంతంలో నిత్యం రైతులు తిరుగుతుంటారు. పశువులను తోటల్లోనే కడుతుంటారు. కానీ ఇంత కాలం ఎక్కడా ఎవరిమీదా దాడిచేసిన సందర్భం లేదు. ఈపరిసర ప్రాంతాల్లో నివాస ప్రాంతాలు ఉన్నాయి. నిత్యం జనం సంచరిస్తుంటారు. పైగా రిజర్వు ఫారెస్ట్‌లో సిబ్బంది తిరుగుతుంటారు. వాళ్లకూ ఏ ఆనవాళ్లూ ఇంతవరకూ కనిపించలేదు. అధికారుల కథనం ప్రకారం రిజర్వు ఫారెస్ట్‌లో పులి సంచరించే ప్రాంతంలో పందులు ఎక్కువ ఉన్నాయని, బహుశా వాటినే ఆహారంగా తింటూ ఉండవచ్చని చెబుతున్నారు. ఇటీవల వరదలకు కొట్టుకొచ్చి ఫోర్త్ బ్రిడ్జి పరిసరాల నుంచి ఇటు వచ్చిందా అనే చర్చ సాగుతోంది. అటవీ ప్రాంతాల నుంచి వచ్చే లారీల ద్వారా వచ్చిందా అనే కోణం నుంచి చర్చ జరుగుతోంది. సాధారణంగా చిరుతపులి చెట్ల మీద ఉంటుది.. దాని వల్ల లారీలపై వచ్చేసి ఉండొచ్చని కొందరు అంచనా వేస్తున్నారు.



రిజర్వు ఫారెస్ట్‌లోనే చిరుత..
జిల్లా అటవీ శాఖాధికారిణి భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 8 : చిరుత పులిని పట్టుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ డీఎఫ్ వో, రాజమండ్రి ఇన్‌చార్జి డీఎఫ్‌వో అన్నారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.వర్షం కురుస్తుండడంతో చిరుత పాదముద్రలు కనుగొనడం చాలా కష్టంగా ఉందని, కెమెరాలలో కూడా కొత్తగా ఇమేజ్‌లు ఏమీ దొరకలేదని చెప్పారు. సాధారణంగా జంతువులు వర్షంలో తడవకూడదని అనుకుంటాయని.. పొదలుగా ఉన్న చోట్ల దాక్కుంటాయని తెలిపారు. ఆటోనగర్‌లో ప్రహరీగోడ మీద చిరుత తిరిగినట్టు గత రాత్రి సమాచారం అందడంతో సిబ్బంది ఆది వారం ఉదయం అక్కడకు వెళ్లి పాదముద్రల కోసం పరిశీలించి ప్రజలను విచారించారన్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి దివాన్‌చెరువు రిజర్వు అటవీప్రాంతం నుంచి మిగిలిన జంతువులు అరుస్తున్నాయని చిరుత పులి లేదా ఏదైనా జంతువు తరుముతుంటే లేక తమపక్కకు వస్తే ఇలా అరుస్తాయన్నారు. దీని వల్ల ఇదే ప్రాంతంలో చిరుత ఉందని నిర్ధారణ అవుతోందని చెప్పారు. వేర్వేరు ప్రాంతాల్లో నాలుగు బోన్లు ఏర్పాటు చేశామని ఇపుడు ఆ చిరుతను ఎలా పట్టుకోవాలనే విషయమై చూస్తున్నామన్నారు. నాలుగు బోన్లు ఏర్పాటు చేశామని, 50 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరిసర ప్రాంతాలలో మైక్ అనౌన్స్ మెంట్ చేశామని, కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. ఈ నెల 16వ తేదీ వరకూ పుష్కరవనం మూసివేసినట్టు తెలిపారు. ఈ నెల 16 వతేదీ వరకూ గోదావరి మహాపుష్కరవనం మూసివేస్తున్నామన్నారు. జనావాస ప్రాంతం ఎక్కువగా ఉన్నందు న ఏదైనా సమాచారం ఉంటే తెలియజేయాలని చెప్పారు.చిరుత సమాచారం ఉంటే 180042 95909 టోల్ ఫ్రీ నెంబరు తెలపాలని కోరారు.


అడవిలో ఏర్పాటు చేసిన బోను


ఇక్కడే పులి నక్కిందా : నిరుపయోగంగా ఉన్న ప్రసార భారతి రిలే కేంద్రం క్వార్టర్స్

బోనుకు చిక్కుతుందా?

నాలుగు బోన్లు ఏర్పాటు చేసినట్టు అధికారులు చెబుతున్నారు.టీవీ రిలేకేంద్రానికి, ఓ నివాస ప్రాంతానికి ఓ,తోటకు మధ్యలో ఉన్న ఫారెస్ట్ ప్రాంతంలో ఓ బోను ఏర్పాటు చేశారు. అందులో ఓ పందిపిల్లను పెట్టారు. అది శుభ్రంగా పడుకుని ఉంది. బోనుకు ఎదురుగా చెట్లకు కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ రైతులు దీనిపై కామెంట్ చేస్తున్నారు. ఓ పంది పిల్లను బోనులో పెట్టడం వల్ల అది మౌనంగా పడుకుని ఉంటుందని, మేకపిల్లో, గొర్రె పిల్లో అయితే అవి అరుస్తాయని చెబుతున్నారు. ఇక్కడ పందిపిల్లను పెట్టారు.కానీ దానికి ఆహారం ఏమీ పెట్టినట్టు లేదనే విమర్శలు ఉన్నాయి.


చెట్టుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ఇళ్ల ముందు లైట్లు వెలుగుతూ ఉండాలి..

పులి నుంచి తప్పించుకోవడానికి కొన్ని సూచనలు చేస్తూ అటవీ శాఖాధికారులు కరపత్రాలు ముద్రించి పంపిణీచేశారు. ఇళ్ల ముందు, ఇళ్ల చుట్టూ కూడా వెళుతురు ఉండేటట్టు లైట్లు ఉంచాలి. చీకటి సమయంలో బయట తిరగకూడదు. ఇళ్లబయట, పొలాల్లో పడుకోవద్దు.అడవిలోకి వెళ్ల వద్దు.పశువులను పొలాల్లో కట్టవద్దు.పులి సంచారం, అడుగుజాడలు కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలి. చిరుతపులి చంపిన పశువులను ఎవరూ తాకవద్దు. దగ్గర కూడా ఉండకూడదు. చిరుత పులి గురించి తప్పుడు ప్రచారం చేయవద్దు. ప్రజలకు ఆందోళన కలిగించవద్దు.చిన్నపిల్లలు బయటకు ఒంటరిగా బయట, ఆటలకు రానీయవద్దు.


గాలిలో వేలాడుతున్న ఆర్టీసీ బస్సు

బస్‌లో..హాహాకారాలు

- అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం బోర్నగూడెం శివారులో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు
- వంతెనపై నుంచి వాగులోకి పడబోయి చెట్టును ఆనుకుని ఆగిన బస్సు
- బస్సులో 25మంది ప్రయాణికులు

అకస్మాత్తుగా ప్రమాదం.. వాళ్లు కూర్చున్న బస్సు ఒక్కసారిగా వాగులోకి పడిపోతోంది.. ఎలా ఆపాలో తెలియట్లేదు. ఏం జరుగుతోందో తెలియని కంగారు.. ప్రాణాలు పోతాయేమోనన్న భయం.. ఇంతలో ఆ బస్సు ఓ చెట్టును ఆనుకుని ఆగింది. అయినా బస్సు గాల్లోనే వేలాడుతోంది.. గాలిలో దీపంలా వాళ్ల ప్రాణాలు గాల్లోనే ఉన్నాయి. కింద ఉధృతంగా ప్రవహిస్తోన్న కొండ వాగు..దీంతో అందరూ పెద్ద ఎత్తున కాపాడండి అంటూ హాహాకారాలు చేశారు.. ఈ హఠాత్పరిణామంతో ప్రయాణికులు షాక్‌లోకి వెళ్లిపోయారు. ఇది.. రాజమహేంద్రవరం నుంచి నర్సీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనలో చిక్కుకున్న 25మంది ప్రయాణికుల పరిస్థితి.. -7లో


చవితి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా గణేశుడి భారీ ప్రతిమలను ప్రతిష్ఠించి అంగరంగ వైభవంగా వేడుకలు చేస్తున్నారు.. గోకవరం పోలీస్ స్టేషన్ వెనుక వీధిలో 18 వేల రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన విగ్రహం ఆకట్టుకుంటుంది. -8లో

మధురపూడి - హైదరాబాద్‌కు పెద్ద విమానాలు

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు

మోరంపూడి ఫ్లయ్ ఓవర్ ప్రారంభం 7


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి చిత్రంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, మంత్రులు

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం.. కేంద్ర మంత్రి కింజరాపు


రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8 : క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా నిధులతో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, మౌలిక సౌకర్యాలకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు అన్నారు.రాజమహేంద్రవరంలో సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం క్రీడలతో సహా అన్ని వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. వాటి నుంచి బయటపడేందుకు సీఎం చంద్రబాబు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర రవాణా, క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించే విధంగా కేంద్రం సహకారంతో కృషి చేస్తామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో అంతర్జాతీయస్థాయి స్టేడియం నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి సహకరించాలని సూచించారు.పురందేశ్వరి మాట్లాడుతున్న సమయంలో పవర్ కట్ అయింది. పది నిమిషాలు వేచి చూసినా రాకపోవడంతో ఎంపీ అసహనానికి గురయ్యారు. స్పీచ్ మధ్యలోనే వదిలేసి వేదికపై కూర్చుండిపోయారు.ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్నాటక, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవుల నుంచి వచ్చిన క్రీడాకారులను కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు పరిచయం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన పార్టీ సిటీ అధ్యక్షుడు అనుశ్రీ సత్యనారాయణ, బ్యాడ్మింటన్ అధ్యక్షుడు అంకం చౌదరి పాల్గొన్నారు.

4 ఫ్లయ్ ఓవర్లపై ఎంపీ పురందేశ్వరి సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు8 : రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో జాతీయ రహదారుల అభివృద్ధి, ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి పనులపై నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్రనాథ్ బృందంతో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చర్చించారు. ఎంపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన భేటీలో దివాన్‌చెరువు, లాలాచెరువు, బొమ్మూరు, వేమగిరి ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిలపై చర్చించారు. వీలైనంత త్వరగా వీటి నిర్మాణం చేపట్టి పూర్తిచేయాలని ఎంపీ సూచించారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో వచ్చే నాలుగు జాతీయ రహదారుల అభివృద్ధి పనులుపై చర్చించారు.

వణికిస్తున్న.. చినుకు

తెరిపివ్వని వాన - ఆందోళనలో జనం


కొవ్వూరులో గోదావరి ఉధృతి


కడియంలో మొక్కల మధ్య చేరిన నీరు


గోతులతో నిండి కానూరు - నడిపల్లి రహదారి

కొవ్వూరు/పెరవలి/దేవరపల్లి/కడియం, సెప్టెంబరు 8 : మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడి వాయుగుండంగా మారుతున్న సమయంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.ఈ వర్షాలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.ఏకదాటిగా వర్షం కురవడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. జనజీవనం స్తంభించింది. దీంతో రహదారులన్నీ వెలవెలబోతున్నాయి. రహదారి గుంతలు, పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. ఎక్కడికక్కడ కాలువలను ఆక్రమించుకుని తూరలు పెట్టడంతో వర్షపునీరు ముందుకు పారక, పొంగి రోడ్లపై ప్రవహిస్తుంది. కొవ్వూరు ఫైర్‌స్టేషన్ ప్రాంగణం, కోర్టు, పోలీస్‌స్టేషన్, కోర్టులకు వెళ్లేమార్గాలు వర్షపునీటితో నిండి కాలువలను తలపించాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిని, నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరవలి మండలం కానూరు, నడిపల్లి రహదారిలో పలుచోట్ల చెరువుల్లా మారడంతో రాకపోకలు ఇబ్బంది కలిగింది. వ్యవసాయ పనులకు అంతరాయం కలిగింది. వ్యవ సాయ కూలీలు, రైతులు ఇబ్బందులుపడ్డారు. దేవరపల్లి మండలం యర్నగూడెం, దుద్దుకూరు, త్యాజంపూడి గ్రామాల్లో చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిపొర్లాయి. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షానికి కడియం మండలంలో మొక్కల ఎగుమతులు నిలిచిపోయాయి. కవరులో ఉన్న మట్టి మొత్తబడిపోయి మొక్క మొదలు కదలిపోయే ప్రమాదం ఉంటుందని నర్సరీ రైతులు వర్షం తగ్గేంత వరకు మొక్కలు ఎగుమతిని ఆపేశారు. దీంతో పెద్ద ఎత్తున నష్టం ఏర్పడింది. మరోవైపు మొక్కల మధ్యన నీళ్లు చేరి ఇబ్బందులు ఎదుర వుతున్నాయి.వర్షం ఎప్పుడు తగ్గుతుందా ? మొక్కల ఎగు మతులు ఎప్పుడు ప్రారంభిద్దాఆమా అంటూ అటు నర్సరీ రైతులు ఎదురు చూస్తున్నారు.

పెరుగుతున్న ఎర్ర కాల్వ నీటిమట్టం

నల్లజర్ల,సెప్టెంబరు 8 : కొంగువారిగూడెం ప్రాజెక్ట్ నుంచి ప్రవహిస్తున్న ఎర్ర కాల్వ నీటిమట్టం పెరుగుతూ వస్తుంది. ఆదివారం మూడు గంటల వరకు సాధారణ ప్రవాహం ఉన్న నీటిమట్టం అనంతపల్లి వద్ద ఒక మీటరు పెరిగి ప్రవహిస్తుంది.ఆదివారం రాత్రికి కొంగువారిగూడెం ప్రాజెక్ట్ నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొంటున్నారు.5 వేల క్యూసెక్కులు విడుదల చేస్తే అనంతపల్లి వద్ద ఎర్రకాల్వ మూడు మీటర్లు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

విద్యుత్ శాఖ ప్రమత్తం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు8 : నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ అప్రమత్తమైంది. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్ విజ్ఞప్తి చేశారు. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాన్ని పట్టుకోరాదని.స్తంభాలకు ఉన్న సపోర్టు వైర్లను ముట్టుకోరాదని చెప్పారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు టోల్ ఫ్రీ నెం 1912కు తెలియజేయాలని కోరారు.

దేవరపల్లిలో అత్యధిక వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. దేవరపల్లి మండలంలో అత్యధికంగా 41.2 మి.మీ వర్షం కురిసింది. 19 మండలాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు జల్లులుగా వాన పడుతూనే ఉంది. అత్యల్పంగా బిక్కవోలులో 9.2 మి.మీ వర్షపాతం నమోదైంది. గోకవరంలో 25.6 మి.మీ , సీతానగరంలో 24.2 మి.మీ, గోపాలపురంలో 23.6 మి.మీ, ఉండ్రాజవరంలో 20.0 మి.మీ, నల్లజర్లలో 19.6 మి.మీ, తాళ్లపూడిలో 19.4 మి.మీ, కోరుకొండలో 18.0 మి.మీ, నిడదవోలులో 17.4 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 16.0 మి.మీ, రాజానగరంలో 14.6 మి.మీ, రంగంపేటలో 14.0 మి.మీ, పెరవలిలో 13.0 మి.మీ, కొవ్వూరులో 13.0 మి.మీ, రాజమహేంద్రవరంలో 11.8 మి.మీ, అనపర్తిలో 11.6 మి.మీ, చాగల్లులో 11.4 ల, కడియంలో 10.0 మి.మీల వర్షపాతం నమోదైంది. సోమవారం భారీ వర్ష సూచన ఉన్నట్టు సమాచారం.

తగ్గిన గోదావరి వరద

కొవ్వూరు, సెప్టెంబరు 8 : అఖండ గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో నీట మునిగిన గోష్పాదక్షేత్రం ప్రధాన స్నానఘట్టాలు నెమ్మదిగా బయట పడుతున్నాయి. వరద తగ్గుముఖం పట్టినప్పటికి కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద గోదావరి ఉధృతంగానే ఉంది. వరద గోదావరిని చూడడానికి కొవ్వూరు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో క్షేత్రానికి చేరుకుంటున్నారు. చవితి సందర్భంగా పూజా పత్రి కలపడానికి గోదావరికి అధికసంఖ్యలో ప్రజలు వస్తున్నారు.

బ్లాక్ స్పాట్స్ పరిశీలించిన ఎస్పీ

రాజానగరం, సెప్టెంబరు 8 : 16వ నెంబరు జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. జిల్లాలోని నేషనల్ హైవేపై గుర్తించిన బ్లాక్ స్పాట్‌లను పరిశీలించారు. సూర్యారావుపేట దుర్గమ్మ గుడి సమీపంలోని హైవేపై ఏర్పాటు చేసిన ఎస్‌వోఎస్ నుంచి ఆదివారం ఎస్పీ ఫోన్ చేసి దాని పనితీరును స్వయంగా తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు తీసుకోవాల్సిన ముందుస్తు జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. అనంతరం నేషనల్ హైవే అథారిటీ అధికారులతో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయన వెంట సీఐలు ప్రసన్న వీరయ్య గౌడ్, ఎ.శ్రీనివాసరావు, ఎస్ఐ మనోహర్ తదితరులు ఉన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ సెప్టెంబరు 8: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన మీకోసం ప్రజాసమస్యల పరిష్కారవేదికను రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. అధిక వర్షపాతం నమోదు కానున్న దృష్ట్యా జిల్లా అధికారులు ,మండల అధికారులు అందుబాటులో ఉండి విపత్తు నిర్వహణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాల్సి ఉందన్నారు. ఈ మేరకు జిల్లా ,డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్ రద్దు చేశామన్నారు.

11 నుంచి ఉచిత ఇసుక

రాజమహేంద్రవరం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి) :ఈ నెల 11 నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన జిల్లా ఇసుక సమన్వయ కమిటీ సమా వేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాలో కొత్తగా డీసిల్టేషన్‌కు 9 పాయింట్లు గుర్తించామన్నారు. ధవళేశ్వరంలో 2, కోటిలింగాల ప్రాంతంలో ఒకటి, కొవ్వూరు పరిధిలోని వాడపల్లి, ఔరంగాబాద్-1, ఔరంగాబాద్-2, ఎర్రినమ్మ,దొండగుంట పాయింట్లు ఉన్నాయన్నారు.వీటి నుంచి బుధవారం ఇసుక తీత మొదలయ్యే అవకాశం ఉం ది.జిల్లాలో ఉచి త ఇసుక సక్రమంగా అమలుచేయడానికి గట్టి నిఘా పెట్టామని కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి సాయం త్రం 6గంటల వరకూ ఇసుక రీచ్‌ల వద్దకు వాహనా లు అనుమతిస్తామన్నారు.అక్రమ ఇసుక రవాణా అరికట్టడానికి వీలుగా వినియోగదారుడి వివరాల ఆధారంగా క్రాస్ చెక్ చేసే వ్యవస్థను అమలులోకి తెచ్చామన్నారు.



డొంకరాయి జలాశయం నుంచి నాలుగుగేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయం నుంచి
నీరు విడుదల

- 4గేట్లు ఎత్తి 8800 క్యూసెక్కుల దిగువకు
- జలాశయంలో 1036.70అడుగుల నీటిమట్టం

మోతుగూడెం, సెప్టెంబరు 8: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయంనకు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయం నుంచి 4గేట్లు ఎత్తి 8800 క్యూసెక్కుల నీటిని దిగువకు జెన్‌కో అధికారులు విడుదల చేస్తున్నారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులుగా కాగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి 12,500 క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లోస్ వచ్చిచేరుతుండటంతో జలాశయం నీటి మట్టం పూర్తిస్థాయికి (ప్రమాదస్థాయి)కి చేరుకోకుండా జెన్‌కో అధికార్లు ముందస్తు చర్యల్లో భాగంగా జలాశయం నుంచి నాలుగు గేట్లు ద్వారా 8800 క్యూసెక్కులు (ఒక్కొక్క గేటు నుంచి 2200క్యూసెక్కులు)నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి 3800 క్యూసెక్కుల నీటిని పవర్ కెనాల్ ద్వారా విడుదల చేస్తూ జలాశయంలో నీటి మట్టం పెరగకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 1036.70అడుగుల నీటిమట్టం కొనసాగుతుంది. జలాశయానికి ఇన్‌ఫ్లోస్ ఇంకా పెరిగితే వచ్చే ఇన్‌ఫ్లోస్‌ను బట్టి దిగువకు నీటిని విడుదల చేయడానికి జెన్‌కో సిబ్బందిని, అధికార్లను అప్రమత్తంగా ఉండాలని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ఆదేశాలు జారీచేశారు. డొంకరాయి ఏపీపీ డ్యాం నుంచి కూడా రెండు గేట్లు ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సాధారణ స్థాయికి గోదావరి వరద

ధవళేశ్వరం, సెప్టెంబరు 8: ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాదహెచ్చరిక స్థాయి దాటి ప్రవహించిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతూ సాధారణ స్థాయికి చేరుకుంటోంది. శనివారం ఉదయం 8గంటలకు నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గడంతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై తగ్గుతున్న నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 8.10అడుగులుగా నమోదుకాగా 5,08681 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటిమట్టం 26.90 అడుగులకు చేరుకుంది.



సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

ఏలేరుకు వరద జోరు

- ఎగువ ప్రాంతం నుంచి భారీగా...
- ఆందోళన చెందుతున్న రైతులు

ఏలేశ్వరం, సెప్టెంబరు 8: ఏలేరు ప్రాజెక్టు నుంచి రెండోరోజు 5500 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేశారు. దీంతో ఆర్డీవో సీతారామారావు ఏలేరు జలాశయాన్ని సందర్శించి కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా పెరిగాయన్నారు. ఆర్డీవో సీతారామారావు మాట్లాడుతూ అల్పపీడనం కారణంగా మరో రెండు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని దీంతో ఎగువ ప్రాంతంలో కురిసే భారీ వర్షాలతో ప్రాజెక్టులో వరద నీరు చేరడంతో ఏలేశ్వరం, తుని, పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, సామర్లకోట, పెద్దాపురం మండలాల కు ప్ర మాదం పొంచి ఉందని అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇప్పటికే పలు మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు.



వరద నీటితో నిండిన ఏలేరు జలాశయం

ఏలేరుకు పెరిగిన వరద నీరు:

ఏలేరు ప్రాజెక్టులో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి నిల్వలు పెరిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 11 గంటలకు ఏలేరులో నీటిమట్టం 85.34 మీటర్లకు చేరగా, నీటి నిల్వలు 21.65 టీఎంసీలకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్‌లోకి అన్ని మార్గాల ద్వారా ఇన్‌ఫ్లోస్ 18,521 క్యూసెక్కు లు వస్తున్నాయి. దీనితో ఏలేరు కాలువలకు 6,900 క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిజ్‌కు 600 క్యూసెక్కులు వెరసి 7,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా విశాఖ అవసరాల నిమిత్తం 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మద్యం మత్తులో వీరంగం

కత్తితో దాడి చేయడంతో వ్యక్తి మృతి



మృతిచెందిన తుమ్మలపల్లి లక్ష్మణరావు

పెనుగుదురు(కరప), సెప్టెంబరు 8: కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురులో ఆదివారం మధ్యాహ్నం మద్యంమత్తులో ఉన్న ఒక నిందితుడు అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపేశాడు. కరప పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెనుగుదురు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వందే రాంబాబు స్థానిక సత్రం బస్‌స్టాండ్‌లో మిత్రులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ తుమ్మలపల్లి లక్ష్మణరావు(58) కూడా అక్కడకు వచ్చి మిత్రులతో కలిసి మద్యం సేవించాడు. అప్పటికే పూటుగా మద్యం సేవించి పడిపోయిన కలవల శ్రీను అనే వ్యక్తిని ఇంటికి తీసుకెళ్లే విషయంలో వీరిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని కొట్లాటకు దారితీసింది. సహచరులు విడదీయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయిన రాంబాబు కొద్దిసేపటి తరువాత మరలా సత్రం బస్‌స్టాండ్‌వద్దకు వచ్చి లక్ష్మణరావుతో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో జేబులో ఉన్న కత్తి తీసి లక్ష్మణరావు కంఠం మీద, పొట్ట మీద పొడిచి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో ఆపస్మారకస్థితిలోకి చేరిన లక్ష్మణరావును గ్రామస్థులు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాకినాడరూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, కరప ఇన్‌చార్జ్ ఎస్‌ఐ ఆర్‌వీఎస్ మూర్తి, ఇంద్రపాలెం ఎస్‌ఐ వి.మణికుమార్‌లు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి హత్యకు సంబంధించిన వివరాలను సేకరించారు. నిందితుడు వందే రాంబాబు ఈ ఏడాది జనవరి 18న నడకుదురు గ్రామానికి చెందిన మర్రి గిరీష్‌కుమార్ అనే వ్యక్తిపై ఇదే తరహాలో కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. నిందితుడు ప్రస్తుతం కండీషన్ బెయిల్‌పై బయట తిరుగుతున్నాడని పోలీసులు తెలిపారు. పట్టపగలు నడిరోడ్డుపై పాశవికంగా హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కుటుంబసభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యకేసు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు.

వీధి సినిమా వేస్తూ విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన మారుతి సుబ్బారావు

కొత్తపేట, సెప్టెంబరు 8: వినాయక ఉత్సవాలలో భాగంగా మోడేకుర్రులో వీధి సినిమా వేస్తూ విద్యుదాఘాతంతో ఒక వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం రాజోలు మండలం శివకోడుపాలెంనకు చెందిన శిరం మారుతి సుబ్బారావు (45) నవరాత్రి ఉత్సవాలకు, పండుగలకు తెరపై సినిమాలు వేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. వినాయక చవితిని పురస్కరించుకుని మోడేకుర్రు గ్రామంలో బాలగణపతి గుడివద్ద శనివారం రాత్రి వీధి సినిమా వేసే నిమిత్తం తెర కడుతుండగా ఆ గుడికి వేసిన లైటింగ్ వైర్లకు గుచ్చిన పిన్నీసు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. దీనిపై అతని భార్య నాగసరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద విద్యుత్ వైర్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేంద్ర సూచించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన కంబాల లక్ష్మి

రావులపాలెం, ఆగస్టు 8: రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఢీకొని ఒక మహిళ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా తిరుపతిపురానికి చెందిన కంబాల లక్ష్మి(58) ఆమె ఆత్రేయపురం మండలం వాడపల్లి కుమార్తె ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం తిరిగి స్వగ్రామానికి బయలుదేరింది. ఈ నేపథ్యంలో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఎక్కేందుకు ఇన్‌గేటు వద్ద కాకినాడ డిపోకు చెందిన బస్సు బలంగా ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు అల్లుడు చిట్టూరి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంటి తెలిపారు.

ఆసుపత్రిపై దాడి కేసులో ఆరుగురి అరెస్టు

రావులపాలెం, సెప్టెంబరు 8: రావులపాలెంలో ప్రగతి నర్సింగ్ హోమ్ ఆసుపత్రిపై దాడికి పాల్పడిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ జేమ్స్‌రత్నప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రావులపాలెం మండలం రావులపాడు పరిధిలో ఉన్న ప్రగతి నర్సింగ్‌హోమ్, ఆసుపత్రి యజమాన్యం, సిబ్బందిపై కొందరు యువకులు దాడి చేశారు. దీనిపై ఆసుపత్రి సిబ్బంది, బుడ్డిగ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ ఆదేశాలమేరకు డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టామన్నారు. ఆసుపత్రిలోని సీసీ ఫుటేజీల ఆధారంగా పి.గన్నవరం మండలం గంటిపెదపూడికి చెందిన చిటికెన బాలబాలాజీ, కుప్పాల సూర్యనారాయణ, కుప్పాల జయబాబు, దంగేటి వెంకటరామదుర్గారావు, దిరిసల చరణ్ తేజ, యర్రంశెట్టి సాయిహేమంత రాజ్‌కుమార్‌లుగా గుర్తించి అరెస్టుచేసి కొత్తపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యువకుడి అనుమానాస్పద మృతిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బా రావునగర్‌కి చెందిన కొండ్రు లోవరాజు(23) లారీ క్లీనరు/డ్రైవ రుగా పనిచేస్తున్నాడు. విజయవాడకు చెందిన యువతితో వివాహం కాగా ఏడాది కిందట మనస్పర్థల కారణంగా విడిపోయారు. ఆరునెలల నుంచి సుబ్బారావునగర్‌కి చెందిన ఓ వివాహితతో సహజీవనం చేస్తున్నాడు. ఆమె కొన్నాళ్ల కిందట భర్తతో విడిపోయింది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇద్దరికీ గొడవ జరిగింది. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం కావడంతో చర్చికి వెళ్లడానికి ఆమె ఉదయం ఇంటికి రాగా ఉరి వేసుకున్న స్థితిలో లోవరాజు ఉన్నాడు. వెంటనే స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. లోవరాజు మృతిపై తల్లి అనుమానం వ్యక్తం చేసింది. దీంతో మృతదేహంలో విస్రాను పరీక్షల నిమిత్తం డాక్టరు ల్యాబ్‌కి పంపామన్నారు.

రత్నగిరిపై వినాయకచవితి వేడుకలు



అన్నవరంలో వినాయకచవితి పూజలు చేస్తున్న దృశ్యం

అన్నవరం, సెప్టంబరు 8: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో వినాయకచవితి వేడుకలను శనివారం నిర్వహించారు. దర్బారు మండపంలో మట్టిగణపతిని ఏర్పాటుచేసి అ ర్చకస్వాములు పూజలు నిర్వహి ంచారు. ఈవో రామచంద్రమోహ న్‌దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

తప్పిన పెనుముప్పు!!

- అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం బోర్నగూడెం శివారులో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు
- వంతెనపై నుంచి వాగులోకి పడబోయి చెట్టును ఆనుకుని ఆగిన బస్సు
- ప్రమాద సమయంలో బస్సులో 25మంది ప్రయాణికులు
- వీరిలో ఏడుగురికి తీవ్రగాయాలు.. మిగిలిన వారికి స్వల్ప గాయాలు
- ప్రయాణికులను ప్రాణాలకు తెగించి కాపాడిన స్థానిక టీడీపీ శ్రేణులు
- బ్రేకులు పడలేదన్న డ్రైవర్.. అతివేగమే కారణమంటున్న ప్రయాణికులు



సాహసోపేతంగా బస్సు లోపలికి వెళ్తున్న టీడీపీ కార్యకర్త



క్షతగాత్రులను బయటకు తీసి ఆస్పత్రికి తరలిస్తున్న టీడీపీ శ్రేణులు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 8: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లిజిల్లా నర్సీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మీదుగా వెళ్తోంది. ఈ బస్సు అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం సమీపంలోని చెరుకుంపాలెం పంచాయతీ బోర్నగూడెం గ్రామశివారులో కాలువపై ఉన్న బ్రిడ్జివద్ద అదుపుతప్పి కాలువలోకి దూసుకువెళ్లింది. పక్కనే ఒక చెట్టుకు బస్సు ఆనుకుని కిందకు వెలాడుతూ ఉండడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. ఆ చెట్టు ఆపకపోయి ఉంటే పెనుప్రమాదం సంభవించేదని ప్రయాణికులు చెబుతున్నారు. బ్రేకులు ఫెయిలవడంతో కంట్రోల్ అవక పక్కకు పడిపోయినట్లు డ్రైవర్ చెబుతున్నాడు. ఉదయం 11.30గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

ప్రాణాలకు తెగించి కాపాడిన టీడీపీ శ్రేణులు

ప్రమాదం జరిగిన ప్రదేశం దట్టమైన అటవీ ప్రాంతం. ఇటువైపు సాధారణంగా జనసంచారం తక్కువగా ఉంటుంది. కానీ ప్రమాద ఘటన జరిగిన పది నిమిషాలకే అదృష్టవశాత్తూ అటుగా టీడీపీ రాజవొమ్మంగి మండల అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు, అరకు మాజీ ఎమ్మెల్యే దొన్నుదొర, టీడీపీ కార్యకర్తలతో కలిసి ఓ కార్యక్రమం నిమిత్తం వెళ్తున్నారు. బస్సు పడిపోవడం గమనించి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. టీడీపీ కార్యకర్తలు మరిశెట్ల శ్రీను, చెక్క లోవరాజు, అదేపల్లి శివ, పెద్దాడ నూకరాజు ప్రమాదకర పరిస్థితిల్లో కూడా బస్సులోకి వెళ్లి ప్రయాణికులను వెనుకపక్కన ఉన్న కిటికీల్లోంచి బయటకు తీశారు. బస్సునుంచి సురక్షితంగా క్షతగాత్రులను బయటకు తీసిన టీడీపీ శ్రేణులు ఆటోల్లో స్థానికంగా ఉన్న జడ్డంగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందరికీ ప్రథమ చికిత్స చేశారు.

క్షతగాత్రులు వీరే...

ఈ ప్రమాద ఘటనలో అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం అనిగేరుకు చెందిన బొకేం మంగతాయారు(40), అల్లూరి జిల్లా రాజవొమ్మంగికి చెందిన పాములూరు రవి(28), కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గోనాడుకు చెందిన గుర్రాల కుమారి(45), అనకాపల్లి జిల్లా కేడీపేటకు చెందిన పెదపాటి వరలక్ష్మి(42), తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఎస్టీరాజాపురం చెందిన కురుముళ్ల మంగ(58), అల్లూరి జిల్లా రాజవొమ్మంగికి చెందిన సోమిరెడ్డి గౌరమ్మ(55)లకు తీవ్ర గాయాలు కాగా వారిని మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరం, ఏలేశ్వరం, నర్సీపట్నం ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేశారు. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడడంతో వారికి ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు తెలిపారు. తహశీల్దార్ కరక సత్యనారాయణ జడ్డంగి ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. కాగా ఆర్టీసీ బస్సు అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు వాపోయారు. ప్రాణాలకు తెగించి బస్సులోకి ఎక్కి ప్రయాణికులను బయటకు తీసిన టీడీపీ కార్యకర్తలు మరిశెట్ల శ్రీను, చెక్క లోవరాజు, అదేపల్లి శివ, పెద్దాడ నూకరాజులను ప్రజలు, అధికారులు అభినందించారు.

రీజెన్సీ తరలింపులో
వాస్తవాలు తెలుసుకోవాలి



- పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, సెప్టెంబరు 8: యానాంలో ఉన్న రీజెన్సీ పరిశ్రమ యానాం నుంచి ఆంధ్రాకు తరలింపు విషయంలో ప్రజలందరూ వాస్తవాలు తెలుసుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రీజెన్సీ విషయంలో పుదుచ్చేరి సీఎం రంగసామి ఎంతో సహకరించారని, ఎన్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించడంలేదనడం అవాస్తవమన్నారు. యాజమాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు పూర్తిస్థాయిలో రాయితీ కల్పించాలనడం సరైందికాదని, ఇప్పటికే యాజమాన్యానికి ప్రభుత్వపరంగా వాటిలో పలు రాయితీలు కల్పించారన్నారు. దీనిపై రీజెన్సీ యాజమాన్యంతో ఎప్పుడైనా చర్చకు తాను సిద్ధమన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తాననన్న నేపథ్యంలో యానాం నుంచి అద్దంకికి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా యానాంపై ఎటువంటి అవగాహన లేని వ్యక్తిపై యాజమాన్యం ఆధారపడి ముందుకెళ్లి ఈపరిస్థితి తెచ్చుకుందన్నారు. యాజమాన్యం యానాంలో పరిశ్రమ తెరవాలని ఉద్దే శం ఉంటే తాను ప్రభుత్వంతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ముందుకు రావాలని మల్లాడి అన్నారు.

సరైన సమాయంలో జవాబు చెబుతాను...

- రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు

రీజెన్సీ తరలింపుపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు స్పందించారు. 1986నుంచి తాను యానాంలోనే ఉన్నా నని, ప్రజలతో ఒకరిగా వారి బాగోగులు చూడడంలో, వారిని కష్ట సమయంలో ఆదుకోవడంతో తన వంతు పాత్ర పోషించానన్నారు. ప్రజలకు తన నిజాయితీ తెలియాలంటే సరైన సమయంలో ప్రజలందరి సమక్షంలో నిర్ణయం చెబుతానన్నారు.

ఘనంగా శ్రీపాద వల్లభుని జయంతి

- ముగిసిన సప్తాహ మహోత్సవాలు



పుష్పాలు, మారేడుదళాలతో పూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతులను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

పిఠాపురం, సెప్టెంబరు 8: శ్రీపాదవల్లభుని జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన కాకినాడజిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదుని జయంతిని ఘ నం గా నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను పుష్పాలు, మారేడు దళాలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, పూలంగి సేవ, అభిషేకాలు జరిగాయి. మహాగణపతి పూజ, స్వామి దివ్యపాదపద్మములకు మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, సర్వపుష్పపూజ, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్రనామార్చన, మంగళహారతి, వేదపారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్ఠానము, గురుచరిత్ర పారాయణ, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, సాయంకాల అర్చన నిర్వహించారు. హోమానికి పూర్ణాహుతి జరిగింది. రాత్రి శ్రీపాదశ్రీవల్లభుల రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు మహాన్న ప్రసాద వితరణ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. వారంరోజులపాటు జరిగిన జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మధురపూడి నుంచి హైదరాబాద్‌కు పెద్ద విమానాలు

- త్వరలో నూతన టెర్మినల్ భవన నిర్మాణం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

కోరుకొండ, సెప్టెంబరు 8: తూర్పుగోదావరిజిల్లా మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు 7 విమాన సర్వీసులు నడుస్తున్నాయని, ఆ సర్వీసుల్లో పెద్ద విమానాలను నడిపి మరింత మంది ప్రయాణికులు వెళ్లేటట్లు చేస్తామని కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. మధురపూడి విమానాశ్రయంవద్ద ఆదివారం విమానాశ్రయం విస్తరణ, కొత్త టెర్మినల్ భవనంపై జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎయిర్‌పోర్టు విస్తరణ పనులు, నూతన టెర్మినల్ భవననిర్మాణ పనులపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్. జ్ఞానేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణలతో సమావేశమై కేంద్ర మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మధురపూడి విమానాశ్రయం చుట్టూ ఉన్న పొలాలకు వెళ్లేందుకు రోడ్డు వేయాలని గతంలో విమానాశ్రయం గోడ చుట్టూ సగం వరకు వేసిన రోడ్డును ఇంకో 2కిలో మీటర్ల మేర పొడిగించి బూరుగుపూడి మెయిన్‌రోడ్డుకు కలపాలని, ఎయిర్‌పోర్టులో పడుతున్న వర్షపునీరు మధురపూడి నల్లా చెరువులో కలుస్తుందని, ఆ చెరువు నిండాక బయటకు వెళ్లే దారి లేక వరి పొలాలను ముంచెత్తుతుందని, దీనిని కాలువల ద్వారా తొర్రిగడ్డ కాలువల్లో కలపాలన్నారు. అలాగే ఎయిర్‌పోర్టు వల్ల మధురపూడిలో సెల్‌టవర్ నిర్మించడం ఆపివేశారని, దాంతో గ్రామంలో సెల్ సిగ్నల్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సెల్‌టవర్ వేయడానికి అనుమతి ఇప్పించాలని మంత్రిని ఎమ్మెల్యే బత్తుల కోరారు. విమానాశ్రయం విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ద్వారా లబ్ధి చేకూర్చాలన్నారు. ఎయిర్‌పోర్టు విస్తరణవల్ల సుమారు 1000 ఎకరాల్లో వ్యవసాయం ఆగిపోయిందని దానిమీద ఆధారపడిన రైతులు, రైతు కూలీలకు వారి అర్హతను బట్టి ఎయిర్‌పోర్టులో చిన్నచిన్న పనులు అప్పగించి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న టెర్మినల్ భవనం 250 మందికి మాత్రమే సరిపడా ఉందని అయితే 1000 మంది ప్రయాణికులు వస్తున్న దృష్ట్యా నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులు చేపట్టి వచ్చే ఆగస్టుకు పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. దీనిపై కేంద్ర పౌర విమానయానశాఖ ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఆయన విమానాశ్రయ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు మంత్రి రామ్మోహన్‌కు విమానాశ్రయంవద్ద ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు తదితరులు స్వాగతం పలికారు.

విఘ్నాలు తొలగించే
సిద్ధి వినాయకుడు

- అయినవిల్లి విఘ్నేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకారంలో శ్రీసిద్ధివినాయకుడు, బారులు తీరిన భక్తులు

అయినవిల్లి, సెప్టెంబరు 8: కోరిన కోర్కెలు తీర్చే దైవం. విఘ్నాలు తొలగించే అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు పోటెత్తారు. వినాయక చవితి సందర్భంగా ఉదయం 3.45 నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల పండ్ల రసాలతో రుద్రాభిషేకం, లక్ష దూర్వార్చన, గణపతి కల్పం, శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మూషిక వాహనంపై శ్రీస్వామివారికి మాడవీధి సేవ అనంతరం స్వామివారికి విశేష అలంకరణ జరిపారు. పంచ హారతులు ఇచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. క్యూలైన్లు, రహదారులు భక్తులతో కిక్కిరిశాయి. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ మర్యాదలతో సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు స్వాగతం పలికారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం చేశారు.

జోరువానలో భక్తుల జోరు..

వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం జోరువానలో అధికసంఖ్యలో భక్తులు అయినవిల్లి సిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు. వినాయక చవితి రోజున 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 10వేల మంది భక్తులు అన్నప్రసాద ట్రస్టులో అన్నప్రసాదం స్వీకరించారు. ఉచిత దర్శనాలు కల్పించడం పట్ల భక్తులు హర్షం వక్తం చేశారు.

చెవిలో చెబితే కోర్కెలు తీర్చే లక్ష్మీగణపతి

- అంగరంగ వైభవంగా చవితి వేడుకలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, సెప్టెంబరు 8: చెవిలో చెబితే కోర్కెలు నెరవేర్చే స్వామిగా పేరొ ందిన తూంూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో చవితి ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి 1-59కు తీర్థపుబిందె సేవతో స్వామివారికి ఉత్సవకమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి దంపతులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శనివారం ఉదయం 10-29కు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు, కుమారుడు మనోజ్, కుమార్తె డాక్టర్ సనాతనిలతో కలసి కలశస్థాపనచేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తూర్పుచాళుక్యులు ఏర్పాటుచేసిన ఈ లక్ష్మీగణపతి ప్రాశస్త్యం దేశం అంతా తెలిసేలా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఇప్పటికే దేవదాయశాఖ రూ. 3కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా వుందని, దీనికి జతగా గ్రామస్తులు రూ.2కోట్లు సమకూరుస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా మరిన్ని నిధులు తీసుకువచ్చి బిక్కవోలు, గొల్లలమామిడాలోని ఆలయాలను అభివృద్ధి చేసి టెంపుల్ టూరిజంగా మారుస్తామని ఆయన వివరించారు. తాపేశ్వరం సురుచి ఫుడ్స్‌వారు స్వామికి 50కిలోల లడ్డూను బహూకరించారు. స్వామి వారిని దర్శించిన ప్రముఖుల్లో జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డీ అండ్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, కూటమి నేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, రావాడ నాగు, ఇందల వీరబాబు, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామి దర్శనాలు కల్పించారు. అనపర్తి సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో 25 మంది పోలీసులతో బిక్కవోలు ఎస్‌ఐ రవిచంద్రకుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి శ్రీనివాస్

ఫ్లైఓవర్లు అన్నీ పూర్తి చేస్తాం

- మోరంపూడి ఫ్లైఓవర్ ప్రారంభం
- మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం : మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 8 : రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం మోరంపూడి సెంటరులో జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో నాటి ఎంపీ మురళీమోహన్ మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌కు శిలాఫలకం వేశారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కారణంగా నేడు ఒక రూపుదాల్చింద న్నారు. ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఏ దేశమైనా ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే అభివృద్ధి చెందుతుందన్నారు. సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ జాతీయ రహదారిపై ఉన్న దివాన్‌చెరువు, బొమ్మూరు, ఐటీసీ వేమగిరి వద్ద ఫ్లయ్ ఓవర్లు కూడా వేగవంతంగా చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గతంలో మురళీమోహన్ ఎంపీగా ఉన్న సమయంలోనే వేమగిరి నుంచి దివాన్ చెరువు వరకు 5 ఫ్లైఓవర్లు మంజూరయ్యాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ ప్రక్రియ నిర్వీర్యం చేసిందన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడు తూ కూటమి ప్రభుత్వంలో ఫ్లయ్ ఓవర్ నిర్మాణం వేగంగా పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

మన్యంలో నేడు విద్యాసంస్థలకు సెలవు

● అల్లూరి జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్ ఉత్తర్వులు

రంపచోడవరం, సెప్టెంబరు 8: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల మన్యంలోని అన్ని విద్యాసంస్థలకు ఈనెల 9(సోమవారం) సెలవు దినంగా ప్రకటిస్తూ అల్లూరిజిల్లా కలెక్టరు ఎ.దినేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో ఈనిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ ఇలా అన్ని యాజమాన్యాలు ఈ సెలవు పాటించాలని సూచించారు. తల్లిదండ్రులెవ్వరూ తమ పిల్లలను పాఠశాలలకు పంపించరాదని పేర్కొన్నారు

అత్యవసర సమస్యలను కంట్రోల్ రూమ్‌కు తెలపండి

● వర్షాలకు రద్దయిన మీకోసంకు ఐటీడీఏ పీవో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

● కంట్రోలు రూమ్ నెంబర్లను విడుదల చేసిన పీవో సింహాచలం

రంపచోడవరం, సెప్టెంబరు 8: భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి సోమవారం రంపచోడవరం ఐటీడీఏలో నిర్వహించే మీ కోసం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేసి ప్రత్యామ్నాయంగా కంట్రోలు రూమ్ ద్వారా ఫోన్లోనే అత్యవసర సమస్యలను స్వీకరించేందుకు ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేశామని, వర్షాలరీత్యా ఎదురైన సమస్యలు, ఇతర అత్యవసర సమస్యలను కంట్రోలు రూమ్‌లో ఫోను ద్వారా స్వీకరిస్తామన్నారు. ఇందుకోసం నాలుగు మొబైల్ నెంబర్లను సిద్ధంగా ఉంచారు. 9492920383; 6303269069; 9441058467; 18004252123(టోల్‌ఫ్రీ) నెంబర్లు అందుబాటులో ఉంటాయని, వాటికి సమస్యలను తెలపవచ్చని అన్నారు..

ఉచిత వైద్య శిబిరం

● మందుల కోసం వాగు దాటి వచ్చిన గ్రామస్తుడు




మిట్టవాడ గ్రామస్తుడు వాగు దాటుకుంటూ తులసిపాక ఒడ్డుకు మందుల కోసం వస్తున్న దృశ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 8: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ తులసిపాక ఒడ్డున ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. అయితే వర్షాలు అధికంగా ఉండడంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కిరణ్, మెడికల్ బృందం వాగు దాటి అవతలకు వెళ్లలేకపోయారు. దీంతో వాగు అవతలున్న గ్రామంలో ప్రజలు కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకుని వారి కుటుంబాలలో జ్వరాలు అధికంగా ఉండడంతో తెగించి మెట్టవాడ వాగును దాటుకుంటూ తులసిపాక ఒడ్డుకు వచ్చి అత్యవసరమైన మందులు తీసుకొని తిరిగి మళ్లీ మెట్టవాడ చేరుకున్నాడు. అనంతరం డాక్టర్ చుట్టుప్రక్కల గ్రామస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కేంద్రమంత్రి దృష్టికి ముంపు మండలాల సమస్యలు

ఎటపాక, సెప్టెంబరు8 : కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు దృష్టికి ముంపు మండలాల సమస్యలను టీడీపీ సీనియర్ నాయకులు కిలారి వెంకటేశ్వరావు, ప్రముఖ వ్యాపారవేత్త బాచినేని రామృష్ణ తీసుకెళ్లారు. ఈమేరకు టీడీపీ నాయకులు ఆదివారం రాజమహేంద్ర వరంలో కేంద్రమంత్రిని కలిశారు. నాలుగు ముంపు మండలాల నిర్వాసితులకు ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం చెల్లించాలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. 18 ఏళ్లు నిండిన వారిని పరిగణలోకి తీసుకుని, ప్యాకేజీ ఇవ్వాలన్నారు. గత ఐదేళ్ల నుంచి వరస నష్టాలతో కుదేలవుతున్న మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. మంత్రికలిసిన వారిలో ఎటపాక మండలం ఐటీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ బాచినేని శ్రీకాంత్ పాల్గొన్నారు.

'వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలి'



వై.రామవరం-యార్లగడ్డ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

వై.రామవరం, సెప్టెంబర్ 8: వై.రామవరం మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి ఏజెన్సీ గ్రామాల్లోని పలు కొండ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.బాపన్నదొర సూచించారు. వై.రామవరం, యార్లగడ్డ మధ్యన ఉన్న వంతెన, బందిగడ్డ, సింగవరం మధ్యన ఉన్న వంతెన, పెద ఊలెంపాడు, కోట, దాలిపాడు తదితర ప్రాంతాల్లో ఉన్న వాగుల వద్ద పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. స్థానిక ఎస్ఐ సంతోష్‌కుమార్ తన సిబ్బందితో ఆయా కొండవాగులు పరిశీలించి వాగుల వద్దకు ప్రజలను రానీయకుండా అప్రమత్తం చేశారు. పాడుబడిన ఇళ్ల వద్ద, చెట్ల కింద ఉండరాదని వర్షాలకు జరిగిన సంఘటనపై అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

గిరిజనుడి అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన సూర్యారెడ్డి(ఫైల్)

వై.రామవరం, సెప్టెంబర్ 8: అల్లూరి జిల్లా వై.రామవరం మండలం దేవరమడుగులకు చెందిన లోతా సూర్యారెడ్డి(33) అనే గిరిజనుడు అదృశ్యంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈనెల 5 సాయంత్రం 7గంటలకు ఇంటి నుంచి వెళ్లిన అతను ఇంతవరకు రాకపోవడంతో అతని భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు సూర్యారెడ్డి నిక్కరుతో ఉన్నట్లు భార్య చెప్పిందన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440904861 కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

మారేడుమిల్లి సీఐగా గోపాలకృష్ణ

మారేడుమిల్లి సెప్టెంబరు 8:మారేడుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా సిహెచ్ గోపాలకృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన రుద్రరాజు భీమరాజు పి.గన్నవర బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ గోపాలకృష్ణ మాట్లడుతూ ప్రస్తుత తుఫాన్ నేపథ్యంలో గిరిజన ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని , ప్రమాదకరమైన వాగులు,కొండకాలువలను దాటవద్దని హెచ్చరించారు. మారేడుమిల్లి - చింతూరు ఘాట్ రోడ్డులో రాకపోకలను ప్రస్తుత అధికవర్షాలు కారణంగా తాత్కలికంగా నిలిపివేస్తున్నాట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని పర్యటక ప్రాంతాలను కూడ తాత్కలికంగా మూసివేసినట్లు తెలిపారు.

జోరుగా వాన..

దేవీపట్నం, సెప్టెంబర్ 8: వాయుగుండం ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండల వ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు వాగులు పొంగి ప్రవహించాయి.

వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 9: మండలంలో వినాయక చవితిని పురస్కరించుకొని వాడవాడలా విఘ్నేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రమైన వీఆర్‌పురం ఇందిరా సెంటర్‌లోని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించిన అనంతరం భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెంలో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ముందుగా మూల విరాట్ గణపతి దేవుడికి తెల్లవారుజాము నుంచి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహానికి ప్రధాన అర్చకుడు పవన్‌స్వామి విశేష పూజలు చేశారు. ఏపీ జెన్కోలో పని చేస్తున్న చంద్రశేఖర్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఏపీ జెన్కో లోయర్ సీలేరు సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, చంద్రశేఖర్ నరసింహమూర్తి, రత్నాకర్, బుజ్జి, కొట్టు శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలో వినాయక చవితి మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను నిలిపి పూజలు జరిపారు. ఆయా వేడుకల్లో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

దేవీపట్నం: మండలంలో ఇందుకూరుపేట, శరభవరం, పాముగండి, చొప్పగొండ తదితర గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో పందిళ్లు వేసి గణపతులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈసందర్భంగా పందిళ్ల వద్ద భజనలు ఏర్పాటు చేశారు. తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి.

ఎటపాక: ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆయా గ్రామాల ప్రజలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఎటపాకలో సీఐ కన్నపరాజు కుటుంబసమేతంగా పూజలు చేశారు.

రేపు ఆర్టీసీ అన్ ఐడెంటిఫైడ్ పార్శిల్స్ వేలం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8: ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీన అన్ ఐడెంటిఫైడ్ పార్శిల్స్ వేలం వేయడం జరుగుతుందని ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) కె.మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన వారు ఆ రోజు ఉదయం రాజమహేంద్రవరం బస్‌స్టేషన్ ఆవరణలోని పార్శిల్ బుకింగ్ ఆఫీస్ వద్ద నిర్వహించే వేలం పాటకు హాజరుకావాలని కోరారు.



కడియం: టీడీపీ నాయకుడు చంటిని సత్కరిస్తున్న దృశ్యం



రాజానగరంలో గణనాథుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల



బిక్కవోలు: కొంకుదురులో పూజలు చేస్తున్న భక్తులు



ధవళేశ్వరంలో పూజల్లో పాల్గొన్న కందుల కృష్ణతేజ

గణపతి బప్పా మోరియా

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- మండపాల్లో కొలువుదీరిన గణనాథులు
- ప్రభుత్వ ఆంక్షలతో తగ్గిన మండపాలు
- రాజానగరంలో రామాయణం విఘ్నేశుడు
- బిక్కవోలు ఆలయానికి పోటెత్తిన భక్తజనం

గోకవరం/కడియం, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వీధుల్లో ప్రత్యేక మండపాలు వేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. వాటిలో వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేశా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా మండపాలు, ఆలయాల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు భక్తిగీతాలు ఏర్పాటు చేశారు. ఇళ్ల భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉండ్రాళ్లు, వివిధ రకాల పండ్లు, పిండి వంటలు నైవేద్యంగా పెట్టారు. కాగా గోకవరంలోని పోలీస్ స్టేషన్ వెనుక వీధిలో రూ.80 వేల వెచ్చించి సుమారు 18వేల రుద్రాక్షలతో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రాజానగరం: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన గణనాథుని విగ్రహాలు అందరిని ఆకర్షిస్తున్నాయి. రాజానగరంలోని లక్ష్మీ థియేటర్ సమీపంలో శ్రీలక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈఏడాది రామాయణ ఘట్టంలో అంశాలను ప్రతిబించే రీతిలో సుమారు 14 అడుగుల ఎత్తుతో కూడిన భారీ గణనాథుడు కొలువుదీరాడు. దీంతో స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. హైదరాబాదులో రూపుదిద్దుకున్న వినాయకుడు ఇక్కడ కొలువుదీరేందుకు స్థానిక శ్రీ లక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ రూ.3.30 లక్షలు వెచ్చించింది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జీఎస్ఎల్ వైద్యావిద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కర రావు, ఆకుల వీర్రాజుతో పాటుగా పలువురు ప్రముఖులు, కూటమి నాయకులు దర్శించుకున్నారు. అలాగే స్థానిక బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి సమయాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించనున్నాయి. కాగా గణపతి మండపాల్లో భారీ లడ్డూలు దర్శనమిస్తున్నాయి. విగ్రహాల పరిమాణం ప్రకారం ఏర్పాటు చేసిన భారీ లడ్డూలు అందరిని ఆకట్టుకుంటున్నాయి.

సన్నగిల్లుతున్న ఉత్సవాల సందడి.. అయితే గ్రామీణ ప్రాంతాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు సందడి రోజు రోజుకు కనుమరుగైపోతోంది. ఒకప్పుడు వీధి వీధిన పోటాపోటీగా నిర్వహించే నవరాత్రి ఉత్సవాలు నేడు అక్కడక్కడ దర్శనమిస్తూ, రాను రాను ఉత్సవాలు సందడి సన్నగిల్లుతోంది. మండపాల ఏర్పాటులో ఓవైపు ప్రభుత్వ ఆంక్షలు, మరో వైపు పెరుగుతున్న ధరల ప్రభావంతో మండపాలు అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి.

బిక్కవోలు: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయం భక్తులతో పోటెత్తింది. వర్షాన్ని కూడ లెక్కచేయకుండా భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. స్వామి చెవిలో కోర్కెలు చెప్పడానికి పోటీ పడ్డారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు దిగవల్లి వెంకటేశ్వరరావు, రామలక్ష్మి, బోడా రాంబాబు, సునీత దంపతులు అన్నదాన ఏర్పాట్లు చేశారు. పది వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, కొమ్మోజు శ్రీనివాస్, పల్లి రాజారెడ్డి, నందిపాటి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆలయ ఈఓ ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు. అలాగే కొంకుదురు మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణపతి వద్ద రుషిపంచమి పూజలు చేశారు. పండితులు వినాయకునికి గరిక, పసుపు, కుంకుమ పూజలు జరిపారు. చిన్నం వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు.

ధవళేశ్వరం: స్థానిక బస్టాండ్ సమీపంలో విఘ్నేశ్వర ఆటోయూనియన్, కరుణాద్రి గణపతి ఆలయ కమిటీ, రథం వీధి ఫ్రెండ్స్ సర్కిల్, రామాలయం గాంధీబొమ్మ సెంటర్, గంజాలవీధి రామాలయం, లక్ష్మీజనార్దన స్వామి కాలనీ, ఎర్రకొండ తదితర ప్రాంతాల్లో వివిధ రూపాల్లో కొలువైన భారీ గణనాథులు పూజలు అందుకున్నారు. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాలను మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు. జనసేన నాయకుడు యడ్ల మహేష్ రథం షెడ్ వద్ద నెలకొల్పిన త్రిముఖ గణపతిని మంత్రి కందుల దుర్గేష్ తనయుడు డాక్టర్ కృష్ణతేజ, టీడీపీ నాయకుడు ఎవాసిరెడ్డి బాబి, సావాడ శ్రీనివాస రెడ్డి, ఆళ్ళ ఆనందరావు తదితరులు దర్శించి పూజలు నిర్వహించారు. ఆటో యూనియన్ నాయకుడు గాలి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడిని బాక్స్‌ప్రసాద్ వివిధ పార్టీల నాయకులు దర్శించుకుని పూజలు చేశారు.

అనపర్తి: స్థానిక శేషగిరిరావుపేటలో ఏర్పాటు చేసిన మందిరంలో వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి లక్ష్మీలతితారాణి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మార్కెండేయపురంలో స్నేహ గణపతి, కుమ్మరి వీధిలో లక్ష్మీగణపతి, రావిచెట్టు వద్ద విజయగణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో గణపతిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కోరుకొండ: కోరుకొండలో సుమారు 70 మండపాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతున్నాయి. అలాగే మండలంలోని నిడిగట్ల, మధురపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను జనసేన జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి దర్శించుకుని పూజలు చేశారు. జంబుపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన మండపాలను మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరాం సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో మింగి లక్ష్మీనారాయణ, నాగా రమేష్, నాగా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: నందివాడవారి వీధిలోని వజ్రగణపతి ఆలయం వద్ద చందాసత్రం మాజీ చైర్మన్ వాకచర్ల కృష్ణ, సూర్యకుమారి దంపతులు స్వామివారికి అభిషేకం చేశారు. నీలపాల తమ్మారావు, కుక్కల తాతబ్బాయి, నామన వాసు తదితరులు వినాయకుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పొత్తేరు యతిరాజ్, సంపత్‌కుమార్, సిరిదే ధన వెంకటేశ్వరరావు,కనమర్లపూడి చంద్రకాంత్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో ప్రాచీన దేవాలయమైన నాళం భీమరాజు వీధిలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూజలు చేశారు. 174 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో పూజలు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. శ్రీరామ్‌నగర్‌లోని సంకట హర వరసిద్ధి వినాయక ఆలయంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ప్రత్యేక పూజలు చేశారు.



కోరుకొండ: నిడిగట్లలో పూజల్లో పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



రాజమహేంద్రవరంలో గణపతి పూజలో పాల్గొన్న భక్తులు



శ్రీలక్ష్మిగణపతి ఆలయం వద్ద కమిటీతో ఎమ్మెల్యే వాసు



అనపర్తిలో గణపతి ప్రతిష్ఠలో పాల్గొన్న డాక్టర్ రామగుర్రెడ్డి దంపతులు

సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

▸▸ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8 : బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అత్యధిక మంది సభ్యులతో బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిందన్నారు. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం నేపథ్యంలో పార్టీ నాయకులు, శ్రేణులతో అవగాహన సమావేశం నిర్వహించారు. సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దత్తు తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన భవనం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులో నిర్మించిన చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన భవనాన్ని మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎస్పీ




మంత్రులు రామ్మోహన్, రామ్‌ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఎస్పీ కిశోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఆదివారం వివిధ కార్యక్రమాల నిమిత్తం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర క్రీడలు, రవాణా మంత్రి మందపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి రాజమహేంద్రవరం విచ్చేశారు. ఈ మేరకు ఎస్పీ నరసింహ కిశోర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఈవో అండ్ సూపర్‌వైజర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: ఆంధ్రప్రదేశ్ ఈవోఅండ్ సూపర్‌వైజర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక రాజమహేంద్రవరంలో జరిగింది. ఎస్‌కేఆర్ ఉమెన్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఐసీడీఎస్ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా బి.వరలక్ష్మి, జిల్లా సెక్రటరీగా యు.పద్మ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఐసీడీఎస్ సినియర్ అసిస్టెంట్ సిహెచ్ వెంకట రమణ, పర్యవేక్షకులిగా రాజకుమారి వ్యవహరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి శ్రీకాంత్‌రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రకాష్ కుమారి, కోనసీమ జిల్లా అధ్యక్షురాలు కె.పద్మావతి పర్యవేక్షించారు. సమావేశంలో రాజ్యలక్ష్మి, మేరి, వరలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ తరలింపు ఆపాలి

ఆర్‌పీసీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: సీఎం చంద్రబాబు మౌనం వీడి వాల్తేర్(విశాఖ) డివిజన్ తరలింపును ఆపకపోతే చరిత్ర క్షమించదని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.ఏపీ ఎంపీలు పార్లమెంట్‌లో మౌనంగా ఉంటే రాష్ట్రానికి ద్రోహం చేసినవారవుతారన్నారు. ఏటా రూ.10 వేల కోట్లు ఆదాయం వచ్చే వాల్తేర్ (విశాఖ) డివిజన్‌ను తరలించే కుట్ర జరుగుతుందన్నారు. సమావేశంలో పెండ్యాల కామరాజు, డివి రమణమూర్తి, సిమ్మా దుర్గారావు, దుడ్డే త్రినాథ్, ఎండీ హుస్సేన్, సుంకర వీరవెంకట భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

117 జీవోతో విద్యావ్యవస్థకు నష్టం

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: ప్రభుత్వ 117 జీవో వల్ల విద్యావ్యవస్థ నష్టపోతుందని రాష్ట్ర టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో అయన మాట్లాడారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. జీవో 80 రద్దు చేసి పాత విధానంలో మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు డానియేలు బాబు, లక్ష్మణ్, అన్ని మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

గోకవరంలో హిందూ ఆత్మీయ సమ్మేళనం

గోకవరం, సెప్టెంబరు 8: రామ జన్మభూమిలో భవ్య రామ మందిర నిర్మాణం పూర్తిచేసుకోవడంలో విశ్వహిందూ పరిషత్ పాత్ర చిరస్మరణీయమని సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధాన అధ్యాపకుడు దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. విశ్వ హిందూ పరిషత్ ఆవిర్భవించి 60 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆదివారం గోకవరంలోని సత్యకృష్ణ ఫంక్షన్‌హాల్లో ఆదివారం నిర్వహించిన హిందూ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. హిందూ సమాజం, గో సంతతి, ధార్మిక గ్రంథాలను పరిరక్షించడం కోసం, అయోధ్యలో రామమందిరం నిర్మాణంలో జనం మద్దతు కూడగట్టడంలోనూ విశ్వహిందూ పరిషత్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు దాసరి తమ్మన్నదొర, మెట్టపల్లి సుబ్బారాయుడు, ఉంగరాల ఆదివిష్ణు, దాసరి చినబాబు, వరసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా విశ్వేశ్వరరెడ్డి



విశ్వేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ది రెడ్డీస్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు టీకే విశ్వేశ్వరరెడ్డిని నియమించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన వైఎస్ఆర్‌పై ఉన్న అభిమానంతో వైసీపీలోకి చేరారు. అటుపై జగన్ తీరును వ్యతిరేకించి ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో టీకేను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం తిలక్‌రోడ్డులోని రెడ్డి కళ్యాణ మండపంలో ది రెడ్డీస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీకేను ఘనంగా సత్కరించారు.

లాలాచెరువులో స్వచ్ఛభారత్

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 8: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ నాయకురాలు బి.రమాదేవి అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్,యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు ఆదివారం శ్రమదానం చేశారు.లాలాచెరువు గోవింద్ క్షేత్రానికి ఎదురుగా స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ భాస్కర్ నగర్ పార్కులో వ్యర్థాలను తొలగించి, 20 మొక్కలను నాటారు. కార్యక్రమంలో యోగా టీచర్ పి.బాబ్జి, సుధాకర్ పట్నాయక్,చందన రాజు,అజాద్ రాజు,లక్ష్మీ సువ, మౌనిష్, అభిషేక్ పాల్గొన్నారు.

ఏఎన్ఆర్ శతజయంతి ఉత్సవాలు



ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శన

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 8: నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వర రావు శత జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభించారు. దీనిలో భాగంగా శోభన్‌బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఇది మేఘ సందేశమో అనురాగ సంకేతమో పేరిట జిత్ మోహన్ మిత్ర కళా వేదికలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఔత్సాహిక గాయకులు గీతాలు ఆలపించారు. జిత్‌మోహన్ మిత్రకు చిరు సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర కిషోర్ కుమార్, సినీనటుడు శ్రీపాద జిత్‌మోహన్ మిత్ర, ముద్రగడ ఏసుబాబు, పీవీఎస్.కృష్ణారావు, శోభన్‌బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

అనపర్తి, సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు అనపర్తి శివారు కొత్తూరుకు చెందిన కర్రి భరత్‌రెడ్డి ఆదివారం తన పుట్టిన రోజు సందర్భంగా రూ.50వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. తండ్రి అచ్యుతరామారెడ్డితో కలిసి ఆయన ఎమ్మెల్యేకు విరాళం అందించారు. ఈ సందర్భంగా భరత్‌రెడ్డిని అభినందించారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: 35 చిన్నకథ కాదు
సూర్యామినీ	: 35 చిన్నకథ కాదు
సూర్యాప్యాలస్	: సరిపోదా శనివారం
స్వామి	: సరిపోదా శనివారం
శివజ్యోతి	: ది గోట్
అనుశ్రీ(సాయికృష్ణ)	: ది గోట్
రాజా	: ది గోట్
ఊర్వశి	: కమిటీ కుర్రోళ్లు
రంభ	: ఉరుకు పటేలా
మేనక	: తంగలాన్
అప్సర	: సరిపోదా శనివారం
కుమారి	: సరిపోదా శనివారం
అశోక	: ఆయ్
వీఎస్ మహల్(నామవరం)	: ది గోట్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ది గోట్
వెంకటసూర్య(కడియం)	: ది గోట్
సత్యగౌరి (అనపర్తి)	: ది గోట్
సూర్యశ్రీ (అనపర్తి)	: ---
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ది గోట్
రామకృష్ణ(కోరుకొండ)	: ---
గీతాసినిమాస్ (సీతానగరం)	: ది గోట్
శ్రీనివాస (గోకవరం)	: ---
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ది గోట్
లలితామహల్(రంపచోడవరం)	: ది గోట్
నవయుగ(చింతూరు)	: ది గోట్



పులి సంచరిస్తున్నట్టు కెమెరాలో చిక్కిన ప్రాంతమిదే



వంతెన పైనుంచి కిందకు వేలాడుతున్న ఆర్టీసీ బస్సు

బస్‌లో..హాహాకారాలు

- అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం బోర్నగూడెం శివారులో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు
- వంతెన పైనుంచి వాగులోకి పడబోయి చెట్టును ఆనుకుని ఆగిన బస్సు
- ప్రమాద సమయంలో బస్సులో 25మంది ప్రయాణికులు
- ప్రాణాలకు తెగించి కాపాడిన టీడీపీ శ్రేణులు

అకస్మాత్తుగా ప్రమాదం.. వాళ్లు కూర్చున్న బస్సు ఒక్కసారిగా వాగులోకి పడిపోతోంది.. ఎలా ఆపాలో తెలియట్లేదు. ఏం జరుగుతోందో తెలియని కంగారు.. ప్రాణాలు పోతాయేమోనన్న భయం.. ఇంతలో ఆ బస్సు ఓ చెట్టును ఆనుకుని ఆగింది. అయినా బస్సు గాల్లోనే వేలాడుతోంది.. గాలిలో దీపంలా వాళ్ల ప్రాణాలు గాల్లోనే ఉన్నాయి. కింద ఉధృతంగా ప్రవహిస్తోన్న కొండ వాగు.. అందులో పడితే బతికి బట్టకట్టగలమా అనే అనుమానం.. ఈ హఠాత్పరిణామంతో అందరూ షాక్‌లోకి వెళ్లిపోయారు. ఇది.. రాజమహేంద్రవరం నుంచి నర్సీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనలో చిక్కుకున్న 25మంది ప్రయాణికుల పరిస్థితి..

రాజవొమ్మంగి, సెప్టెంబరు 8

ఈ బస్సు ఆదివారం ఉదయం 11.30గంటల సమయంలో అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని చెరుకుంపాలెం పంచాయతీ బోర్నగూడెం గ్రామశివారులో కాలువపై ఉన్న బ్రిడ్జివద్ద అదుపు తప్పి కాలువలోకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో 25మంది ప్రయాణికులకుగాను ఆరుగురు తీవ్రంగా గాయపడగా, మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. కాసేపటికి టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఓ కార్యక్రమానికి వెళ్తూ ఈ బస్సును గమనించి ఆగారు. కిందకి దిగి బస్సులోకి చూస్తే ప్రయాణికులు కనిపించారు. వెంటనే టీడీపీ కార్యకర్తలు మరిశెట్ల శ్రీను, చెక్క లోవరాజు, అదేపల్లి శివ, పెద్దాడ నూకరాజు సహాయక చర్యలు చేపట్టి వారందరినీ ప్రాణాలకు తెగించి కాపాడి ఆస్పత్రికి తరలించారు. బస్సు వాగులో పడిన వెంటనే ఆ చెట్టు ఆపకపోతే పెనుప్రమాదమే సంభవించేదని ప్రయాణికులు చెప్తున్నారు. తమను ప్రాణాలకు తెగించి బస్సు నుంచి బయటకు తీసి కాపాడిన టీడీపీ కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. కాగా, ఈ ఘటనలో మానవత్వంతో స్పందించి 25మంది ప్రాణాలను కాపాడిన టీడీపీ కార్యకర్తలను ప్రజలు, అధికారులు అభినందించారు.

మధురపూడి - హైదరాబాద్‌కు

పెద్ద విమానాలు

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు

మోరంపూడి ఫ్లయ్ ఓవర్ ప్రారంభం 8



చిరుత.. కలకలం

- రాజమహేంద్రవరంలో భయాందోళన
- లాలాచెరువు వద్ద రిజర్వు ఫారెస్ట్
- మూడు రోజులుగా నక్కిన చిరుత పులి
- 50 ట్రాప్ కెమెరాలు..4 బోన్లు ఏర్పాటు
- 16 వరకు పుష్కరవనం మూత

చిరుతపులి..భయపెడుతోంది. రాజమహేంద్రవరం నగరాన్ని ఆనుకుని ఉన్న రిజర్వు ఫారెస్ట్ ఏరియా పరిసర ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తుండడం శుక్రవారం సీసీ కెమెరాల్లో స్పష్టంగా నమోదైంది. దీంతో స్థానిక ప్రజానీకం తీవ్ర ఆందోళన చెం దుతున్నారు. ఇప్పటి వరకూ ఆ చిరుతపులి జంతువులపై దాడిచేసిన సంఘటనలు లేవు. సీసీ కెమెరాలో మాత్రం ఒక పంది వెనుక నడుస్తున్న దృశ్యాలు స్పష్టంగా ఉన్నాయి.ఈ మేరకు అటవీ శాఖ అధికారులు అడుగు జాడలు గుర్తించారు.


- (రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

చిరుత పులి ఎక్కడ?

చిరుతపులి ఎక్కడి నుంచి ఎలా వచ్చిందనేదానికి అధికారుల వద్ద సమాధానం లేదు. హౌసింగ్ బోర్డు ఆటోనగర్ మధ్య ఒక జంతువును నోట కరచుకుని వెళుతున్న చిరుతపులిని శుక్రవారం ఒకరు చూసినట్టు ప్రచారం సాగింది.శుక్రవారం రాత్రి 11.25 గంటలకు లాలాచెరువు వద్ద ఉన్న టీవీ రిలేకేంద్రం(ప్రసార భారతి) ప్రధాన గేటు వద్ద ఉన్న సీసీ కెమెరాలో ఒక పందిని వెంబడిస్తూ వెళ్లిన చిరుతపులి స్పష్టంగా కనిపించింది. దానికి కొంత దూరంలో ఉన్న హైవే నుంచి టీవీ రిలే కేంద్రానికి వచ్చే దారిలో పులి అడుగులు ముందుగా గుర్తించారు. ఫారెస్ట్ అకా డమీకి దగ్గరలో ఉన్న వేయింగ్‌మిషన్ వద్ద అడుగు జాడలు గుర్తించినట్టు స్థానికులు చెబుతున్నారు. వేయింగ్ మిషన్ వెనుక ఉన్న తోట నుంచి టీవీ రిలేకేంద్రం వైపు వెళ్లినట్టు అడుగుజాడలు కనిపిస్తు న్నాయి. కానీ శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఆటోనగర్ ప్రాంతంలో ఒక గోడ మీద నుంచి వెళుతున్నట్టు అక్కడి వారు చెప్పినట్టు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. రిజర్వుఫారెస్ట్ 536 హెక్టార్లు. ఈ ప్రాంతంలోనే ఉంటుందనే అంచనా ఉంది.ప్రస్తుతం వానలు పడుతుండడంతో అడవిలో చెట్ల మీద..చెట్ల కింద ఉండే పులి ఉండే అవకాశం తక్కువ. టీవీ రిలే కేంద్రానికి సంబంధించి క్వార్టర్ల చుట్టూ తుప్పలు పెరిగాయి.శుక్రవారం రాత్రి వీటి సమీపంలోకి వెళుతూనే చిరుతపులి రిలే రిలే కేంద్రం సీసీ కెమెరాలకు చిక్కింది. బహుశా ఈ భవనాల్లో కూడా ఉండే అవ కాశం లేకపోలేదు. ఇక్కడ చాలా భవనాలు ఉన్నాయి. నిపుణులను రప్పించి వెంటనే దీనిని పట్టించాలని ప్రజ లు కోరుతున్నారు.

అడవి చుట్టూ జనావాసమే..

లాలాచెరువు సమీపంలో 536 హెక్టార్ల రిజర్వు ఫారెస్ట్ లాలా చెరువు -దివాన్‌చెరువు జాతీ య రహదారికి అటూ ఇటూ ఉంది. రిజర్వుఫారెస్ట్‌లో అటవీ అకాడమీ, పరిశోధన తదితర అటవీ కార్యాలయాలు ఉన్నాయి. రిలే కేంద్రం ఉంది. దాని వెనుక స్వరూపనగర్, రూపానగర్, శ్రీరామనగర్ ఉన్నాయి. రూపానగర్ మీదుగా శ్రీరాంపురం వెళ్లడానికి అటవీ దారి ఉంది. అక్కడ నుంచి దివాన్ చెరువు గ్రామం ఉంది. పుష్కరవనం పక్క ఆటోనగర్ ఉంది. వీటి మధ్యనే అడవి ఉంది. ఈ అడవిలోనే చిరుత పులి పుట్టి పెరిగిందా అనే అనుమానాలు ఉన్నాయి. ఇక్కడ పుట్టి పెరిగి ఉండొచ్చనే అనుమానం అధికారులు వ్యక్తపరచడం గమనార్హం. ఇక్కడే పుట్టి పెరిగిందనుకుంటే దాని తల్లి ఎక్కడ.. దాని ఫ్యామిలీ ఎక్కడ అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పైగా అధికారులు ఇది మగపులి అనీ, సబ్‌ఎడల్ట్ అంటే యుక్త వయసు కన్నా చిన్నదని చెబుతున్నారు. సుమారు 75 కేజీల బరువు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. పైగా ఇక్కడే పుట్టి పెరిగితే ఇంతవరకూ ఇక్కడ జంతువులపై దాడి చేసిన సందర్భాలు లేవు.



పులి సంచారం ఇక్కడే?

ఒక మగ చిరుత పులి ఒంటరిగా ఉందని.. దాని వయస్సు 3 నుంచి 4 సంవత్సరాలు ఉండవచ్చునన్నారు. స్వరూప్‌నగర్, పద్మావతినగర్, రూపనగర్, తారకరామనగర్, ఏపీహౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీరాంపురం,దివాన్‌చెరువు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఇక్కడిదా.. బయటదా?

అటవీ ప్రాంతం వెనుక జీడిమామిడి,నిమ్మ,సీతాఫలాలు, మామిడి తోటలు ఇంచుమించు అడవిలాగే ఉం టాయి. ఈ ప్రాంతంలో నిత్యం రైతులు తిరుగుతుంటారు. పశువులను తోటల్లోనే కడుతుంటారు. కానీ ఇంత కాలం ఎక్కడా ఎవరిమీదా దాడిచేసిన సందర్భం లేదు. ఈపరిసర ప్రాంతాల్లో నివాస ప్రాంతాలు ఉన్నాయి. నిత్యం జనం సంచరిస్తుంటారు. పైగా రిజర్వు ఫారెస్ట్‌లో సిబ్బంది తిరుగుతుంటారు. వాళ్లకూ ఏ ఆనవాళ్లూ ఇంతవరకూ కనిపించలేదు. అధికారుల కథనం ప్రకారం రిజర్వు ఫారెస్ట్‌లో పులి సంచరించే ప్రాంతంలో పందులు ఎక్కువ ఉన్నాయని, బహుశా వాటినే ఆహారంగా తింటూ ఉండవచ్చని చెబుతున్నారు. ఇటీవల వరదలకు కొట్టుకొచ్చి ఫోర్త్ బ్రిడ్జి పరిసరాల నుంచి ఇటు వచ్చిందా అనే చర్చ సాగుతోంది. అటవీ ప్రాంతాల నుంచి వచ్చే లారీల ద్వారా వచ్చిందా అనే కోణం నుంచి చర్చ జరుగుతోంది. సాధారణంగా చిరుతపులి చెట్ల మీద ఉంటుది.. దాని వల్ల లారీలపై వచ్చేసి ఉండొచ్చని కొందరు అంచనా వేస్తున్నారు.



రిజర్వు ఫారెస్ట్‌లోనే చిరుత..

జిల్లా అటవీ శాఖాధికారిణి భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 8 : చిరుత పులిని పట్టుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ డీఎఫ్ వో, రాజమండ్రి ఇన్‌చార్జి డీఎఫ్‌వో అన్నారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.వర్షం కురుస్తుండడంతో చిరుత పాదముద్రలు కనుగొనడం చాలా కష్టంగా ఉందని, కెమెరాలలో కూడా కొత్తగా ఇమేజ్‌లు ఏమీ దొరకలేదని చెప్పారు. సాధారణంగా జంతువులు వర్షంలో తడవకూడదని అనుకుంటాయని.. పొదలుగా ఉన్న చోట్ల దాక్కుంటాయని తెలిపారు. ఆటోనగర్‌లో ప్రహరీగోడ మీద చిరుత తిరిగినట్టు గత రాత్రి సమాచారం అందడంతో సిబ్బంది ఆది వారం ఉదయం అక్కడకు వెళ్లి పాదముద్రల కోసం పరిశీలించి ప్రజలను విచారించారన్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి దివాన్‌చెరువు రిజర్వు అటవీప్రాంతం నుంచి మిగిలిన జంతువులు అరుస్తున్నాయని చిరుత పులి లేదా ఏదైనా జంతువు తరుముతుంటే లేక తమపక్కకు వస్తే ఇలా అరుస్తాయన్నారు. దీని వల్ల ఇదే ప్రాంతంలో చిరుత ఉందని నిర్ధారణ అవుతోందని చెప్పారు. వేర్వేరు ప్రాంతాల్లో నాలుగు బోన్లు ఏర్పాటు చేశామని ఇపుడు ఆ చిరుతను ఎలా ట్టుకోవాలనే విషయమై చూస్తున్నామన్నారు. నాలుగు బోన్లు ఏర్పాటు చేశామని, 50 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరిసర ప్రాంతాలలో మైక్ అనౌన్స్ మెంట్ చేశామని, కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. ఈ నెల 16వ తేదీ వరకూ పుష్కరవనం మూసివేసినట్టు తెలిపారు. ఈ నెల 16 వతేదీ వరకూ గోదావరి మహాపుష్కరవనం మూసివేస్తున్నామన్నారు. జనావాస ప్రాంతం ఎక్కువగా ఉన్నందు న ఏదైనా సమాచారం ఉంటే తెలియజేయాలని చెప్పారు.చిరుత సమాచారం ఉంటే 180042 95909 టోల్ ఫ్రీ నెంబరు తెలపాలని కోరారు.



అడవిలో ఏర్పాటు చేసిన బోను



ఇక్కడే పులి నక్కిందా : నిరుపయోగంగా ఉన్న ప్రసార భారతి రిలే కేంద్రం క్వార్టర్స్

బోనుకు చిక్కుతుందా?

నాలుగు బోన్లు ఏర్పాటు చేసినట్టు అధికారులు చెబుతున్నారు.టీవీ రిలేకేంద్రానికి, ఓ నివాస ప్రాంతానికి ఓ,తోటకు మధ్యలో ఉన్న ఫారెస్ట్ ప్రాంతంలో ఓ బోను ఏర్పాటు చేశారు. అందులో ఓ పందిపిల్లను పెట్టారు. అది శుభ్రంగా పడుకుని ఉంది. బోనుకు ఎదురుగా చెట్లకు కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ రైతులు దీనిపై కామెంట్ చేస్తున్నారు. ఓ పంది పిల్లను బోనులో పెట్టడం వల్ల అది మౌనంగా పడుకుని ఉంటుందని, మేకపిల్లో, గొర్రె పిల్లో అయితే అవి అరుస్తాయని చెబుతున్నారు. ఇక్కడ పందిపిల్లను పెట్టారు.కానీ దానికి ఆహారం ఏమీ పెట్టినట్టు లేదనే విమర్శలు ఉన్నాయి.



చెట్టుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ఇళ్ల ముందు లైట్లు వెలుగుతూ ఉండాలి..

పులి నుంచి తప్పించుకోవడానికి కొన్ని సూచనలు చేస్తూ అటవీ శాఖాధికారులు కరపత్రాలు ముద్రించి పంపిణీచేశారు. ఇళ్ల ముందు, ఇళ్ల చుట్టూ కూడా వెళుతురు ఉండేటట్టు లైట్లు ఉంచాలి. చీకటి సమయంలో బయట తిరగకూడదు. ఇళ్లబయట, పొలాల్లో పడుకోవద్దు.అడవిలోకి వెళ్ల వద్దు.పశువులను పొలాల్లో కట్టవద్దు.పులి సంచారం, అడుగుజాడలు కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలి. చిరుతపులి చంపిన పశువులను ఎవరూ తాకవద్దు. దగ్గర కూడా ఉండకూడదు. చిరుత పులి గురించి తప్పుడు ప్రచారం చేయవద్దు. ప్రజలకు ఆందోళన కలిగించవద్దు.చిన్నపిల్లలు బయటకు ఒంటరిగా బయట, ఆటలకు రానీయవద్దు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి చిత్రంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, మంత్రులు

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం.. కేంద్ర మంత్రి కింజరాపు


రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8 : క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా నిధులతో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, మౌలిక సౌకర్యాలకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు అన్నారు.రాజమహేంద్రవరంలో సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం క్రీడలతో సహా అన్ని వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. వాటి నుంచి బయటపడేందుకు సీఎం చంద్రబాబు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర రవాణా, క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించే విధంగా కేంద్రం సహకారంతో కృషి చేస్తామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో అంతర్జాతీయస్థాయి స్టేడియం నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి సహకరించాలని సూచించారు.పురందేశ్వరి మాట్లాడుతున్న సమయంలో పవర్ కట్ అయింది. పది నిమిషాలు వేచి చూసినా రాకపోవడంతో ఎంపీ అసహనానికి గురయ్యారు. స్పీచ్ మధ్యలోనే వదిలేసి వేదికపై కూర్చుండిపోయారు.ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్నాటక, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవుల నుంచి వచ్చిన క్రీడాకారులను కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు పరిచయం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన పార్టీ సిటీ అధ్యక్షుడు అనుశ్రీ సత్యనారాయణ, బ్యాడ్మింటన్ అధ్యక్షుడు అంకం చౌదరి పాల్గొన్నారు.

4 ఫ్లయ్ ఓవర్లపై ఎంపీ పురందేశ్వరి సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు8 : రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో జాతీయ రహదారుల అభివృద్ధి, ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి పనులపై నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్రనాథ్ బృందంతో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చర్చించారు. ఎంపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన భేటీలో దివాన్‌చెరువు, లాలాచెరువు, బొమ్మూరు, వేమగిరి ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిలపై చర్చించారు. వీలైనంత త్వరగా వీటి నిర్మాణం చేపట్టి పూర్తిచేయాలని ఎంపీ సూచించారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో వచ్చే నాలుగు జాతీయ రహదారుల అభివృద్ధి పనులుపై చర్చించారు.

వణికిస్తున్న.. చినుకు

తెరిపివ్వని వాన - ఆందోళనలో జనం



కొవ్వూరులో గోదావరి ఉధృతి

కడియంలో మొక్కల మధ్య చేరిన నీరు





గోతులతో నిండి కానూరు - నడిపల్లి రహదారి

కొవ్వూరు/పెరవలి/దేవరపల్లి/కడియం, సెప్టెంబరు 8 : మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడి వాయుగుండంగా మారుతున్న సమయంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.ఈ వర్షాలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.ఏకదాటిగా వర్షం కురవడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. జనజీవనం స్తంభించింది. దీంతో రహదారులన్నీ వెలవెలబోతున్నాయి. రహదారి గుంతలు, పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఎక్కడికక్కడ కాలువలను ఆక్రమించుకుని తూరలు పెట్టడంతో వర్షపునీరు ముందుకు పారక, పొంగి రోడ్లపై ప్రవహిస్తుంది. కొవ్వూరు ఫైర్‌స్టేషన్ ప్రాంగణం, కోర్టు, పోలీస్టేషన్, కోర్టులకు వెళ్లేమార్గాలు వర్షపునీటితో నిండి కాలువలను తలపించాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిని, నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరవలి మండలం కానూరు, నడిపల్లి రహదారిలో పలుచోట్ల చెరువుల్లా మారడంతో రాకపోకలు ఇబ్బంది కలిగింది. వ్యవసాయ పనులకు అంతరాయం కలిగింది. వ్యవ సాయ కూలీలు, రైతులు ఇబ్బందులుపడ్డారు. దేవరపల్లి మండలం యర్నగూడెం, దుద్దుకూరు, త్యాజంపూడి గ్రామాల్లో చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిపొర్లాయి. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షానికి కడియం మండలంలో మొక్కల ఎగుమతులు నిలిచిపోయాయి. కవరులో ఉన్న మట్టి మొత్తబడిపోయి మొక్క మొదలు కదలిపోయే ప్రమాదం ఉంటుందని నర్సరీ రైతులు వర్షం తగ్గేంత వరకు మొక్కలు ఎగుమతిని ఆపేశారు. దీంతో పెద్ద ఎత్తున నష్టం ఏర్పడింది. మరోవైపు మొక్కల మధ్యన నీళ్లు చేరి ఇబ్బందులు ఎదుర వుతున్నాయి.వర్షం ఎప్పుడు తగ్గుతుందా ? మొక్కల ఎగు మతులు ఎప్పుడు ప్రారంభిద్దాంఆమా అంటూ అటు నర్సరీ రైతులు ఎదురు చూస్తున్నారు.

పెరుగుతున్న ఎర్ర కాల్వ నీటిమట్టం

నల్లజర్ల,సెప్టెంబరు 8 : కొంగువారిగూడెం ప్రాజెక్ట్ నుంచి ప్రవహిస్తున్న ఎర్ర కాల్వ నీటిమట్టం పెరుగుతూ వస్తుంది. ఆదివారం మూడు గంటల వరకు సాధారణ ప్రవాహం ఉన్న నీటిమట్టం అనంతపల్లి వద్ద ఒక మీటరు పెరిగి ప్రవహిస్తుంది.ఆదివారం రాత్రికి కొంగువారిగూడెం ప్రాజెక్ట్ నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొంటున్నారు.5 వేల క్యూసెక్కులు విడుదల చేస్తే అనంతపల్లి వద్ద ఎర్రకాల్వ మూడు మీటర్లు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

విద్యుత్ శాఖ ప్రమత్తం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు8 : నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ అప్రమత్తమైంది. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్ విజ్ఞప్తి చేశారు. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాన్ని పట్టుకోరాదని..స్తంభాలకు ఉన్న సపోర్టు వైర్లను ముట్టుకోరాదని చెప్పారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు టోల్ ఫ్రీ నెం 1912కు తెలియజేయాలని కోరారు.

దేవరపల్లిలో అత్యధిక వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. దేవరపల్లి మండలంలో అత్యధికంగా 41.2 మి.మీ వర్షం కురిసింది. 19 మండలాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు జల్లులుగా వాన పడుతూనే ఉంది. అత్యల్పంగా బిక్కవోలులో 9.2 మి.మీ వర్షపాతం నమోదైంది. గోకవరంలో 25.6 మి.మీ , సీతానగరంలో 24.2 మి.మీ, గోపాలపురంలో 23.6 మి.మీ, ఉండ్రాజవరంలో 20.0 మి.మీ, నల్లజర్లలో 19.6 మి.మీ, తాళ్ళపూడిలో 19.4 మి.మీ, కోరుకొండలో 18.0 మి.మీ, నిడదవోలులో 17.4 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 16.0 మి.మీ, రాజానగరంలో 14.6 మి.మీ, రంగంపేటలో 14.0 మి.మీ, పెరవలిలో 13.0 మి.మీ, కొవ్వూరులో 13.0 మి.మీ, రాజమహేంద్రవరంలో 11.8 మి.మీ, అనపర్తిలో 11.6 మి.మీ, చాగల్లులో 11.4 మి, కడియంలో 10.0 మి.మీల వర్షపాతం నమోదైంది. సోమవారం భారీ వర్ష సూచన ఉన్నట్టు సమాచారం.

తగ్గిన గోదావరి వరద

కొవ్వూరు, సెప్టెంబరు 8 : అఖండ గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో నీట మునిగిన గోష్పాదక్షేత్రం ప్రధాన స్నానఘట్టాలు నెమ్మదిగా బయట పడుతున్నాయి. వరద తగ్గుముఖం పట్టినప్పటికి కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద గోదావరి ఉధృతంగానే ఉంది. వరద గోదావరిని చూడడానికి కొవ్వూరు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో క్షేత్రానికి చేరుకుంటున్నారు. చవితి సందర్భంగా పూజా పత్రి కలపడానికి గోదావరికి అధికసంఖ్యలో ప్రజలు వస్తున్నారు.

బ్లాక్ స్పాట్స్ పరిశీలించిన ఎస్పీ

రాజానగరం, సెప్టెంబరు 8 : 16వ నెంబరు జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. జిల్లాలోని నేషనల్ హైవేపై గుర్తించిన బ్లాక్ స్పాట్‌లను పరిశీలించారు. సూర్యారావుపేట దుర్గమ్మ గుడి సమీపంలోని హైవేపై ఏర్పాటు చేసిన ఎస్‌వోఎస్ నుంచి ఆదివారం ఎస్పీ ఫోన్ చేసి దాని పనితీరును స్వయంగా తెలసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు తీసుకోవాల్సిన ముందుస్తు జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. అనంతరం నేషనల్ హైవే అథారిటీ అధికారులతో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయన వెంట సీఐలు ప్రసన్న వీరయ్య గౌడ్, ఎ.శ్రీనివాసరావు, ఎస్ఐ మనోహర్ తదితరులు ఉన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ సెప్టెంబరు 8: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన మీకోసం ప్రజాసమస్యల పరిష్కారవేదికను రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. అధిక వర్షపాతం నమోదు కానున్న దృష్ట్యా జిల్లా అధికారులు ,మండల అధికారులు అందుబాటులో ఉండి విపత్తు నిర్వహణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాల్సి ఉందన్నారు. ఈ మేరకు జిల్లా ,డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్ రద్దు చేశామన్నారు.

11 నుంచి ఉచిత ఇసుక

రాజమహేంద్రవరం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి) :ఈ నెల 11 నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన జిల్లా ఇసుక సమన్వయ కమిటీ సమా వేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాలో కొత్తగా డీసిల్టేషన్‌కు 9 పాయింట్లు గుర్తించామన్నారు. ధవళేశ్వరంలో 2, కోటిలింగాల ప్రాంతంలో ఒకటి, కొవ్వూరు పరిధిలోని వాడపల్లి, ఔరంగాబాద్-1, ఔరంగాబాద్-2, ఎర్రినమ్మ,దొండగుంట పాయింట్లు ఉన్నాయన్నారు.వీటి నుంచి బుధవారం ఇసుక తీత మొదలయ్యే అవకాశం ఉం ది.జిల్లాలో ఉచి త ఇసుక సక్రమంగా అమలుచేయడానికి గట్టి నిఘా పెట్టామని కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి సాయం త్రం 6గంటల వరకూ ఇసుక రీచ్‌ల వద్దకు వాహనా లు అనుమతిస్తామన్నారు.అక్రమ ఇసుక రవాణా అరికట్టడానికి వీలుగా వినియోగదారుడి వివరాల ఆధారంగా క్రాస్ చెక్ చేసే వ్యవస్థను అమలులోకి తెచ్చామన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా అరుణ



పెరవలి, సెప్టెంబరు 8: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారిని నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉత్తర్వులు పంపినట్టు ఆమె స్వయంగా తెలిపారు. జిల్లాల్లో పార్టీ పటిష్టతకు తాను చేసిన కృషిని గుర్తించి రాష్ట్ర స్థాయి కమిటీలో స్థానం కల్పించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లాలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

గోలింగేశ్వరస్వామికి లక్షపత్రి పూజ



నిడదవోలు, సెప్టెంబరు 8: నిడదవోలులోని రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వర స్వామికి ఆదివారం 640వ లక్షపత్రి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామి వారికి లక్షపత్రి, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వరద బాధితులకు 'మానవత' చేయూత



విజయవాడ బాధితుల కోసం సామగ్రి తరలిస్తున్న మానవత సభ్యులు

గోపాలపురం, సెప్టెంబరు 8: విజయవాడలోని ముంపు ప్రాంత ప్రజలకు మండలంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.3లక్షలతో దుప్పట్లు, పాలు, రొట్టెలను సిద్ధం చేసి విజయవాడలోని వాంబే కాలనీ, సింగ్‌నగర్, రాజీవ్ కాలనీల్లో ఆదివారం పంపిణీ చేశారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, సెప్టెంబరు 8: తిమ్మరాజు పాలెంలో కోటసత్తెమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలయార్చకులు సుప్రభాత సేవ, దూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్ర నామ కుంకుమ పూజలు, క్షీర, మహా నివేదన జరిపారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనం కలగజేశారు.

మాజీ ఎమ్మెల్యే రామారావు పుట్టినరోజు



రామారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 8: మాజీ ఎమ్మెల్యే, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు జన్మదిన వేడుకలు ఆదివారం జరిగాయి. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ సమీపంలోని ఆయన నివాసంలో జనసేన నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. రామారావుకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామ కృష్ణారావు, సూర్యదేవర రంజిత్, కొఠారు వెంకట్రావు, కె.నవ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం



ధవళేశ్వరం వద్ద సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 8: ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాదహెచ్చరిక స్థాయి దాటి ప్రవహించిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతూ సాధారణ స్థాయికి చేరుకుంటోంది. శనివారం ఉదయం 8గంటలకు నీటి మట్టం 11.70అడుగులకు తగ్గడంతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాదహెచ్చరికను ఉపసంహరించారు. ఆపై తగ్గుతున్న నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 8.10అడుగులుగా నమోదుకాగా 5,08681 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటి మట్టం 26.90అడుగులకు చేరుకుంది.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా విశ్వేశ్వరరెడ్డి



విశ్వేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ది రెడ్డీస్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు టీకే విశ్వేశ్వరరెడ్డిని నియమించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన వైఎస్ఆర్‌పై ఉన్న అభిమానంతో వైసీపీలోకి చేరారు. అటుపై జగన్ తీరును వ్యతిరేకించి ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో టీకేను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం తిలక్‌రోడ్డులోని రెడ్డి కళ్యాణ మండపంలో ది రెడ్డీస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీకేను ఘనంగా సత్కరించారు.

గోకవరంలో హిందూ ఆత్మీయ సమ్మేళనం

గోకవరం, సెప్టెంబరు 8: రామ జన్మభూమిలో భవ్య రామ మందిర నిర్మాణం పూర్తిచేసుకోవడంలో విశ్వహిందూ పరిషత్ పాత్ర చిరస్మరణీయమని సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధాన అధ్యాపకుడు దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. విశ్వ హిందూ పరిషత్ ఆవిర్భవించి 60 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆదివారం గోకవరంలోని సత్యకృష్ణ ఫంక్షన్‌హాల్లో ఆదివారం నిర్వహించిన హిందూ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. హిందూ సమాజం, గో సంతతి, ధార్మిక గ్రంథాలను పరిరక్షించడం కోసం, అయోధ్యలో రామమందిరం నిర్మాణంలో జనం మద్దతు కూడగట్టడంలోనూ విశ్వహిందూ పరిషత్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు దాసరి తమ్మన్నదొర, మెట్టపల్లి సుబ్బారాయుడు, ఉంగరాల ఆదివిష్ణు, దాసరి చినబాబు, వరసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

అనపర్తి, సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు అనపర్తి శివారు కొత్తూరుకు చెందిన కర్రి భరత్‌రెడ్డి ఆదివారం తన పుట్టిన రోజు సందర్భంగా రూ.50వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. తండ్రి అచ్యుతరామారెడ్డితో కలిసి ఆయన ఎమ్మెల్యేకు విరాళం అందించారు. ఈ సందర్భంగా భరత్‌రెడ్డిని అభినందించారు.

రేపు ఆర్టీసీ అన్ ఐడెంటిఫైడ్ పార్శిల్స్ వేలం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8: ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీన అన్ ఐడెంటిఫైడ్ పార్శిల్స్ వేలం వేయడం జరుగుతుందని ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) కె.మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన వారు ఆ రోజు ఉదయం రాజమహేంద్రవరం బస్‌స్టేషన్ ఆవరణలోని పార్శిల్ బుకింగ్ ఆఫీస్ వద్ద నిర్వహించే వేలం పాటకు హాజరుకావాలని కోరారు.



కొవ్వూరులో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి



నల్లజర్ల: పోతవరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



చాగల్లులో జ్ఞానసరస్వతి పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు

గణపతి బప్పా మోరియా

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన గణనాథులు
- ప్రభుత్వ ఆంక్షలతో తగ్గిన మండపాలు
- మండపాల వద్ద విద్యుద్దీపకాంతులు
- చాగల్లులో ఆకట్టుకున్న విగ్రహాలు

కొవ్వూరు/గోపాలపురం, సెప్టెంబరు 8: వినాయకచవితి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కొవ్వూరు సంస్కృత పాఠశాల శివాలయం, గోష్పాదక్షేత్ర శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి గణేషున్ని అలంకరించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా పట్టణంలో ఏర్పాటుచేసిన పలు మండపాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రౌండ్ రామాలయం, అంజనేయస్వామి ఆలయం వద్ద, 22వ వార్డు పోతురాజు దిబ్బ, దేవిశ్రీ, అనన్య థియేటర్ల వద్ద, 6వ వార్డు సుబ్రహ్మణ్యస్వామి వద్ద, కంటమణివారి వీధి, ఇందిరమ్మ కాలనీ, అచ్చాయమ్మ కాలనీ, 8వ వార్డు లాంచీలరేవు వద్ద, 20వ వార్డు, 10వ వార్డు ఫ్యాక్టరీరోడ్‌లోని రామాలయం వద్ద గణేష్ మండపాల్లో పూజా కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు అందించాలని, రాష్ట్ర ప్రగతికి విఘ్నాలు రాకుండా చూడాలని విఘ్నేశ్వరున్ని ప్రార్థించారు.

దేవరపల్లి: దేవరపల్లిలో మెరకవీధి వినాయకుడి గుడి వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా మద్దిపాటి విజయం సాధిస్తే 108కొబ్బరికాయలు కొడతామని జనసేన నాయకులు మొక్కడంతో ఆయన కొబ్బరికాయలు కొట్టారు. అన్ని గ్రామాల్లోనూ గణపతి మండపాల వద్ద ప్రత్యేక విద్యుత్ కాంతులతో విఘ్నేశ్వరుడు పార్వతి సమేత స్వామివారిని అలంకరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు గణపతి పూజించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆండ్రూ అనీల్, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, కరుటూరి శ్రీనివాస్, గద్దే సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు కంబాల సత్తిబాబు, సూరిశెట్టి బాలు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని పోతవరం-యర్నగూడెం రోడ్డులో ఉన్న సిద్ధి వినాయక ఆలయంలో అబ్బూరి శ్రీనివాస్, అబ్బూరి నరేష్ దంపతులు పూజాదికాలు నిర్వహించగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు స్వామి వారిని దర్శించుకున్నారు. వేదపండితుడు సతీష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఏలేటి సత్యనారాయణ, అబ్బూరి పట్టియ్య, పసుమర్తి ప్రభాకరావు, మండా శ్రీను, కొండేపాటి శేషగిరి పాల్గొన్నారు. చీపురుగూడెం, నల్లజర్ల, అనంతపల్లి గ్రామాల్లో వినాయక ఆలయాల వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో యద్దనపూడి బ్రహ్మరాజు, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, ఆలపాటి రామకృష్ణ, సవలం రామకృష్ణ, మండా పవన్, కేకే పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులో తెలగ సంఘం వినాయకుడు గుడి వద్ద, వర్తక సంఘం సంపత్ వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద ప్రత్యేక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. విద్యార్థులు జ్ఞానసర స్వతి పూజలు నిర్వహించారు. వేదపండితులు పూజాకార్యక్రమాలు ఆధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



గోపాలపురం: దొండపూడిలో గణపతి పూజల్లో పాల్గొన్న భక్తులు

నిడదవోలు: నిడదవోలులోని యాదవుల వీధిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 11 అడుగుల శివపార్వతుల గణపతి పలువురిని విశేషంగా ఆకర్షిసోంది. అలాగే గణేష్‌చౌక్ సెంటరులోని పూజా గణపతి కుమారస్వామి ఆలయం వద్ద 105వ వినాయక ఉత్సవాలను ఆలయ కమిటీ ఘనంగా ప్రారంభించింది. వాడవాడలా వినాయకచవితి ఉత్సవాలు స్వామి వారికి ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి.



నిడదవోలు యాదవుల వీధిలో గణపతి విగ్రహం

మధురపూడి-హైదరాబాద్‌కు పెద్ద విమానాలు

- త్వరలో నూతన టెర్మినల్ భవన నిర్మాణం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- రైతులు పొలాలకు వెళ్లేందుకు రోడ్డు వేయాలి
- ఎయిర్‌పోర్ట్ స్థల బాధితులకు ఆర్అండ్ఆర్‌తో లబ్ధి చేకూర్చాలి
- ఎమ్మెల్యే బత్తుల వినతి

కోరుకొండ, సెప్టెంబరు 8: తూర్పుగోదావరి జిల్లా మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు 7 విమాన సర్వీసులు నడుస్తున్నాయని, ఆ సర్వీసుల్లో పెద్ద విమానాలను నడిపి మరింత మంది ప్రయాణికులు వెళ్లేటట్టు చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. మధురపూడి విమానాశ్రయం వద్ద ఆదివారం విమానాశ్రయం విస్తరణ, కొత్త టెర్మినల్ భవనంపై జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎయిర్‌పోర్టు విస్తరణ పనులు, నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణలతో సమావేశమై కేంద్ర మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మధురపూడి విమానాశ్రయం చుట్టూ ఉన్న పొలాలకు వెళ్లేందుకు రోడ్డు వేయాలని గతంలో విమానాశ్రయం గోడ చుట్టూ సగం వరకు వేసిన రోడ్డును ఇంకో 2కిలోమీటర్ల మేర పొడిగించి బూరుగుపూడి మెయిన్ రోడ్డుకు కలపాలని ఎమ్మెల్యే బత్తుల మంత్రిని కోరారు. ఎయిర్‌పోర్టులో పడుతున్న వర్షపు నీరు మధురపూడి నల్లా చెరువులో కలుస్తుందని, ఆ చెరువు నిండాక బయటకు వెళ్లే దారి లేక వరి పొలలను ముంచెత్తుతుందని, దీనిని కాలువల ద్వారా తొర్రిగడ్డ కాలువల్లో కలపాలన్నారు. అలాగే ఎయిర్‌పోర్టు వల్ల మధురపూడిలో సెల్‌టవర్ నిర్మించడం ఆపివేశారని, దాంతో గ్రామంలో సెల్ సిగ్నల్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సెల్‌టవర్ వేయడానికి అనుమతి ఇప్పించాలని మంత్రిని కోరారు. విమానాశ్రయం విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఆర్అండ్ఆర్ ద్వారా లబ్ధి చేకూర్చాలన్నారు. ఎయిర్‌పోర్టు విస్తరణ వల్ల సుమారు 1000 ఎకరాల్లో వ్యవసాయం ఆగిపోయిందని దాని మీద ఆధారపడిన రైతులు, రైతు కూలీ లకు వారి అర్హతను బట్టి ఎయిర్‌పోర్టులో చిన్నచిన్న పనులు అప్పగించి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న టెర్మినల్ భవనం 250 మందికి మాత్రమే సరిపడా ఉందని అయితే 1000 మంది ప్రయాణీకులు వస్తున్న దృష్ట్యా నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులు చేపట్టి వచ్చే ఆగస్టుకు పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. దీనిపై కేంద్ర పౌర విమానయాన శాఖ ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఆయన విమానాశ్రయ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు మంత్రి రామ్మోహన్‌కు విమానాశ్రయం వద్ద ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు తదితరులు స్వాగతం పలికారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి శ్రీనివాస్

- ఫ్లయ్ ఓవర్లు అన్నీ పూర్తి చేస్తాం : మంత్రి దుర్గేష్
- మోరంపూడి ఫ్లయ్ ఓవర్ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 8: రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం మోరంపూడి సెంటరులో జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన ఫ్లయ్‌ఓవర్‌ను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో నాటి ఎంపీ మురళీమోహన్ మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌కు శిలాఫలకం వేశారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరి కారణంగా నేడు ఒక రూపుదాల్చింద న్నారు. ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఏ దేశమైనా ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే అభివృద్ధి చెందుతుందన్నారు. సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ జాతీయ రహదారిపై ఉన్న దివాన్‌చెరువు, బొమ్మూరు, ఐటీసీ వేమగిరి వద్ద ఫ్లయ్ ఓవర్లు కూడా వేగవంతంగా చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గతంలో మురళీమోహన్ ఎంపీగా ఉన్న సమయంలోనే వేమగిరి నుంచి దివాన్‌చెరువు వరకు 5 ఫ్లయ్ ఓవర్లు మంజూరయ్యాయన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ ప్రక్రియ నిర్వీర్యం చేసిందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఫ్లయ్ ఓవర్ నిర్మాణం వేగంగా పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'117 జీవోతో విద్యావ్యవస్థకు నష్టం'



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: ప్రభుత్వ 117 జీవో వల్ల విద్యావ్యవస్థ నష్టపోతుందని రాష్ట్ర టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. జీవో 80 రద్దు చేసి పాత విధానంలో మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు డానియేలు బాబు, లక్ష్మణ్, అన్ని మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

'వాల్తేర్ డివిజన్ తరలింపు ఆపాలి'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: సీఎం చంద్రబాబు మౌనం వీడి వాల్తేర్(విశాఖ) డివిజన్ తరలింపును ఆపకపోతే చరిత్ర క్షమించదని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.ఏపీ ఎంపీలు పార్లమెంట్‌లో మౌనంగా ఉంటే రాష్ట్రానికి ద్రోహం చేసినవారవుతారన్నారు. ఏటా రూ.10 వేల కోట్లు ఆదాయం వచ్చే వాల్తేర్ (విశాఖ) డివిజన్‌ను తరలించే కుట్ర జరుగుతుందన్నారు. సమావేశంలో పెండ్యాల కామరాజు, డివి రమణమూర్తి, సిమ్మా దుర్గారావు, దుడ్డే త్రినాథ్, ఎండీ హుస్సేన్, సుంకర వీర వెంకట భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8 : బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అత్యధిక మంది సభ్యులతో బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిందన్నారు. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం నేపథ్యంలో పార్టీ నాయకులు, శ్రేణులతో అవగాహన సమావేశం నిర్వహించారు. సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు దత్తు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన భవనం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులో నిర్మించిన చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన భవనాన్ని మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

లాలాచెరువులో స్వచ్ఛభారత్

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 8: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ నాయకురాలు బి.రమాదేవి అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్,యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు ఆదివారం శ్రమదానం చేశారు.లాలాచెరువు గోవింద్ క్షేత్రానికి ఎదురుగా స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ భాస్కర్‌నగర్ పార్కులో వ్యర్థాలను తొలగించి, 20 మొక్కలను నాటారు. కార్యక్రమంలో యోగా టీచర్ పి.బాబ్జి, సుధాకర్ పట్నాయక్,చందన రాజు, అజాద్ రాజు, లక్ష్మీసుమ, మౌనిష్, అభిషేక్ పాల్గొన్నారు.

ఏఎన్ఆర్ శతజయంతి ఉత్సవాలు



ఏఎన్ఆర్ శత జయంతి ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శన

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 8: నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభించారు. దీనిలో భాగంగా శోభన్‌బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఇది మేఘ సందేశమో అనురాగ సంకేతమో పేరిట జిత్ మోహన్ మిత్ర కళావేదికలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఔత్సాహిక గాయకులు గీతాలు ఆలపించారు. జిత్‌మోహన్ మిత్రను సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్ర కిషోర్‌కుమార్, ముద్రగడ ఏసుబాబు, పీవీఎస్ కృష్ణారావు, శోభన్‌బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎస్పీ



మంత్రులు రామ్మోహన్, రామ్‌ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఎస్పీ కిశోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఆదివారం వివిధ కార్యక్రమాల నిమిత్తం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర క్రీడలు, రవాణా మంత్రి మందపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి రాజమహేంద్రవరం విచ్చేశారు. ఈ మేరకు ఎస్పీ నరసింహ కిశోర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఈవో అండ్ సూపర్‌వైజర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8: ఆంధ్రప్రదేశ్ ఈవోఅండ్ సూపర్‌వైజర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక రాజమహేంద్రవరంలో జరిగింది. ఎస్‌కేఆర్ ఉమెన్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఐసీడీఎస్ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా బి.వరలక్ష్మి, జిల్లా సెక్రటరీగా యు.పద్మ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఐసీడీఎస్ సినియర్ అసిస్టెంట్ సిహెచ్ వెంకట రమణ, పర్యవేక్షకులిగా రాజకుమారి వ్యవహరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి శ్రీకాంత్‌రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రకాష్ కుమారి, కోనసీమ జిల్లా అధ్యక్షురాలు కె.పద్మావతి పర్యవేక్షించారు. సమావేశంలో రాజ్యలక్ష్మి, మేరి, వరలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	సరిపోదా శనివారం
రాధాకృష్ణ	ఆయ్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్